రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త



# కొడంగల్‌కు సిఎం రేవంత్‌రెడ్డి రాక

**-అగ్రికల్చర్ యూనివర్శిటీ పనులకు, శ్రీవారి ఆలయ పునఃనిర్మాణ పనులకు శంకుస్థాపన**

**కొడంగల్, ఏప్రిల్ 25 ప్రభాతవార్త:**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వచ్చేనెల మే 2న కొడంగల్‌లో పర్యటించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొడంగల్‌కు అగ్రికల్చర్ యూనివర్శిటీ మంజూరైనట్లు తెలిపారు. ఇందుకుగాను మే 2న మండలపరిధిలోని అప్పాయిపల్లి గ్రామ శివారులోని సర్వేనెంబర్ 19లో అగ్రికల్చర్ యూనివర్శిటీ నిర్మాణపనులకు సిఎం శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. అలాగే పేదలపెన్నిధిగా పేరుగాంచి, రెండవ తిరుపతిగా వెలుగొందుతున్న కొడంగల్ శ్రీమహాలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ పునఃనిర్మాణ పనులకు సిఎం శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. అలాగే పలు అభివృద్ధి పనులను సిఎం ప్రారంభించనున్నట్లు తెలిపారు. వచ్చేనెల మే 2న కొడంగల్‌లో సిఎం పర్యటన ఖరారుకావడంతో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

# ప్రమాదవశాత్తు కాలుజారి పడి వ్యక్తి మృతి

**తలకొండపల్లి, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:**

తలకొండపల్లి మండల పరిధిలోని చంద్రదన గ్రామానికి చెందిన వృద్ధుడు కాలుజారి మృతిచెందిన సంఘటన శుక్రవారంరాత్రి చోటు చేసుకుంది. స్థానిక తలకొండపల్లి ఎస్సై కె.శేఖర్ తెలిపిన వివరాల ప్రకారం, చంద్రదాన గ్రామానికి చెందిన మైసగల్ల యాదయ్య(56) అను వ్యక్తి ఆరోగ్యం బాగాలేక పోవటంతో ఇంటి దగ్గరనే ఉంటున్నాడు. ఈ నెల 22న మధ్యాహ్నం తన ఇంటిదగ్గర మెట్లు దిగుతుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడటంతో తీవ్ర గాయాలకు గురయ్యాడు. దీంతో అతని ముక్కుకు, దవడకు బలమైన గాయం అయ్యి, రక్తస్రావం కావడంతో వెంటనే 108 అంబులెన్స్‌లో కల్వకుర్తి హాస్పిటల్ తీసుకొని చికిత్స జరుపుతుండగా, అక్కడ వైద్యుల సూచనల మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం నాగర్‌కర్నూల్ గవర్నమెంట్ హాస్పిటల్‌లో అడ్మిట్ చేసారు. చికిత్సపొందుతూ శుక్రవారంరాత్రి 10:50 గంటల సమయంలో మరణించాడు. మృతుడి తమ్ముడు కృష్ణయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై శేఖర్ తెలిపారు.

## శ్రీహనుమాన్ పూజా కార్యక్రమంలో ఎంపి

**-పాల్గొన్న అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి**



పూజా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతున్న మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్

**శామీర్‌పేట, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:**

తుర్కపల్లిలోని అభయాంజనేయస్వామి ఆలయంలో శ్రీహనుమాన్ పూజాకార్యక్రమం కన్నుల పండువగా ఘనంగా జరిగింది. ఈ పూజాకార్యక్రమంలో మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ పాల్గొని ప్రత్యేకంగా పూజలుచేశారు. శనివారం శామీర్‌పేట మండలంలోని తుర్కపల్లి గ్రామంలో శ్రీఅభయాంజనేయస్వామి ఆలయంలో శ్రీహనుమాన్ ప్రత్యేకపూజలు నిర్వహించారు. హనుమాన్ మాల గురుస్వామి నర్సింగ్‌రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపి ఈటల రాజేందర్ తోపాటు పలువురు హనుమాన్ మాలధార స్వాములు, అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కంఠం శిరీషకృష్ణారెడ్డి, ఆలయ చైర్మన్ గురకల సాయి, కౌన్సిలర్ దీపికవరప్రసాద్‌రెడ్డి, మరికొందరు కౌన్సిలర్లు, శామీర్‌పేట మండల మాజీఎంపిపి బి.చంద్రశేఖర్‌యాదవ్, సీనియర్ నాయకులు మహిపాల్‌రెడ్డి, రాజేందర్, దూడల నాగేశ్‌గౌడ్, పలువురు ముఖ్య నాయకులు పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని పూజలుచేశారు.

## ఎల్కగూడెం సర్పంచి బందెయ్యపై హత్యాయత్నం..!

**-ఈదమ్మ దేవత జాతరలో ఘటన**

**-మాజీ సర్పంచి రాంరెడ్డి తదితరుల ఘాతుకం**

**షాద్‌నగర్, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:**

రంగారెడ్డి జిల్లా చౌదరిగుడ మండలం ఎలుకగూడెం గ్రామ కాంగ్రెస్ పార్టీ సర్పంచి బందెయ్యపై అదే గ్రామానికి చెందిన మాజీ సర్పంచి రాంరెడ్డి తదితర వర్గీయులు హత్యాయత్నం చేశారు. గ్రామంలో ఈదమ్మ జాతర సందర్భంగా సర్పంచి బందెయ్య అన్ని ఏర్పాట్లుచేశారు. రజకకులానికి చెందిన సర్పంచి బందెయ్య గ్రామంలో జాతరపనులను చేస్తుండగా, ఇది గిట్టని గ్రామ మాజీ సర్పంచి రామ్‌రెడ్డి శనివారం సాయంత్రం సర్పంచిపై దాడికి తెగబడ్డాడు. తన అనుచరులతో కలిసి మారణాయుధాలతో వెంటాడి, వేటాడి మరీ దారుణంగా హత్యాయత్నం చేసినట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఈ దాడి ఘటనలో సర్పంచి తలకు, ఇతర భాగాలలో తీవ్ర గాయాలు అయ్యాయి. సంఘటన సమాచారం అందుకున్న స్థానిక ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ పార్టీ నాయకులతో కలిసి హుటాహుటిన గ్రామానికి చేరుకున్నారు. అక్కడ సర్పంచి కుటుంబ సభ్యులను వెళ్లి కలుసుకున్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు అకారణంగా తన భర్తపై అందరు చూస్తుండగానే దాడికి తెగబడ్డారని, తక్కువ కులస్థుడు ఊరిలో జాతర జరపడం చూసి ఓర్వలేక అగ్రకుల అహంకారంతో అతనిపై హత్యాయత్నానికి పాల్పడ్డాడని కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే శంకర్ ముందు రోదిస్తూ చెప్పారు. కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే శంకర్ ధైర్యం చెప్పారు. గ్రామంలో బందోబస్తు ఏర్పాటు చేయాలని చౌదరిగుడా పోలీసులకు ఎమ్మెల్యే ఆదేశించారు. అదేవిధంగా ఈ ఘటనపై ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది మంచి పద్ధతి కాదని నేరస్థులు ఎంత పెద్దవారైనా చట్టరీత్యా కఠినంగా శిక్షించాలని పోలీసులను ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రికి తరలించిన సర్పంచిని పరామర్శించడానికి ఎమ్మెల్యే బయలుదేరి వెళ్లారు. వైద్యశాఖ అధికారులతో వెంటనే ఆయన ఫోన్‌లో మాట్లాడుతూ మెరుగైన చికిత్స అందించాలని ఒకవేళ ప్రాణాపాయస్థితి ఏర్పడితే వెంటనే హైదరాబాద్‌కు తరలించాలని ఎమ్మెల్యే సిబ్బందిని ఆదేశించారు.

## మొండిగౌరెల్లి భూసేకరణలో రగడ

**యాచారం, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:**

యాచారం మండలపరిధిలోని మొండిగౌరెల్లి గ్రామంలో సర్వేనెంబర్ 19,68,127లలో 677 ఎకరాల అసైన్డ్‌భూమి టిఎస్ఐఐజిసి ఆధ్వర్యంలో సేకరిస్తున్నారు. ఆర్డిఓ అనంతరెడ్డి, తహసీల్దార్ అయ్యప్ప, ఆర్ఐ రామకృష్ణ, గ్రామపాలన అధికారి భాస్కర్‌లతో కలిసి భూసేకరణ చేపట్టారు. గ్రామంలో భూసేకరణ రోజుకు ఓమలుపు తిరుగుతుంది. గ్రామంలో కొంతమంది పట్టాలు ఉన్నవని, కొంతమంది భూమిపై కబ్జాలోలేరని ఎన్నోసందేహాలు ఉన్నాయి. తప్పుడు పత్రాలుగలవారు ఉన్నారని కొందరు వాదనలు చేస్తున్నారు .ఆరోపణలు తిప్పికొడుతూ తమకు సరైనపత్రాలు కలిగి ఉన్నామని నిరూపించుకోవడానికే ఎన్నోప్రయత్నాలు చేస్తున్నారని తెలుస్తుంది. గ్రామ పంచాయతీలో ఎంతోమంది భూసేకరణలో భూములు ఉన్నా, లేకున్నా తమకు పరిహారం దక్కేందుకు ప్రయత్నం చేస్తున్నారని అందుకు అధికారులు సహకరిస్తున్నారనే ఆరోపణలుకూడా వినిపిస్తున్నాయి. గ్రామంలో రెండువర్గాలుగా మారి ఎన్నోవిధాలుగా తమకు నచ్చినట్టు వారు భూసేకరణ సమయంలో అధికారులచుట్టూ తిరుగుతూ ప్రదక్షిణలు చేస్తున్నట్టు చెప్పున్నారు. మేడిపల్లిలో ఎంతోమంది లబ్ధిపొందారాని నేడు ఇక్కడకూడా అనర్హులు లబ్ధిపొందేందుకు చూస్తున్నట్లు వివిధ పార్టీల వారు తమ అభిప్రాయాలను వ్యక్తంచేస్తున్నారు. భూసేకరణ విషయంలో త్వరలో ఏం జరుగుతుందో చూడాలని అధికారుల పనితీరుపై పలువురు నిఘావేసిచూస్తున్నారు. యాచారం తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న అధికారులకు కూడా ఇక్కడ పాగావేసి చాలాకాలంనుండి పనిచేయడం వల్ల అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపణ వినిపిస్తున్నాయి. ముఖ్యంగా క్షేత్రస్థాయి అధికారులు తీవ్రస్థాయిలో అవినీతికి పాల్పడుతున్నారని పేర్కొంటున్నారు.

## పర్యావరణవేత్త దుశ్చర్లపై దాడి అమానుషం

**-జాతీయ హరితదళ సమన్వయకర్త వార్ల మల్లేశం**

**దౌల్తాబాద్, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:**

ప్రముఖ పర్యావరణ ఉద్యమకారుడు, జలసాధనసమితి వ్యవస్థాపకులు దుశ్చర్ల సత్యనారాయణపై జరిగిన భౌతికదాడిని జాతీయ హరితదళ సమన్వయకర్త వనమాలి వార్ల మల్లేశం తీవ్రంగా ఖండించారు. శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..ప్రకృతిని ప్రాణంగా ప్రేమించే వ్యక్తిపై ఇలాంటి దాడిజరగడం సభ్యసమాజం తలదించుకోవాల్సిన విషయమని ఆవేదన వ్యక్తంచేశారు. సూర్యాపేట జిల్లా మోతె మండలం రాఘవాపురంలో దుశ్చర్ల సత్యనారాయణ తన వారసత్వంగా వచ్చిన 70ఎకరాల భూమిని గత ఆరుదశాబ్దాలుగా ఒక అద్భుతమైన కృత్రిమ అడవిగా తీర్చిదిద్దారు. ఎందరో విధ్యార్థులు, పరిశోధకులు ఇక్కడ పర్యావరణ అధ్యయనాలు చేస్తుంటారు. అక్రమంగా అడవిలోకి ప్రవేశించి చెట్లనునరుకుతూ, గొర్రెలను మేపుతున్న బయ్య గంగయ్య, మల్లయ్యలను వారించినందుకు..వారు తమ కుటుంబ సభ్యులతో కలిసి సత్యనారాయణపై విచక్షణారహితంగా దాడిచేయడం అత్యంతదారుణం అని మల్లేశం పేర్కొన్నారు. దుశ్చర్ల సత్యనారాయణ కేవలం పర్యావరణవేత్త మాత్రమే కాదని, గొప్ప సామాజిక పోరాట యోధుడని అన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాను పీడిస్తున్న ఫ్లోరైడ్ సమస్యపై జలసాధన పేరుతో సుదీర్ఘపోరాటం చేశారని, బ్యాంకింగ్‌రంగంలో ఉన్నతహోదాల్లో పనిచేసిన ఆయన, ప్రకృతిపై మక్కువతో ఆ ఉద్యోగానికి రాజీనామా చేశారని, మూగజీవాల కోసం తన భూమిలో ఐదుకరాల్లో ప్రత్యేక పంటలు పండించడం, పక్షుల కోసం ఏడు కుంటలు తవ్వించడం వంటి పనుల ద్వారా ఎన్నో అంతర్జాతీయ అవార్డులను అందుకున్నారని, ఈదాడికి పాల్పడిన గంగయ్య, మల్లయ్యతో పాటు రోషాలు, సుమలత, యశ్వంత్, అనూషలపై చట్టపరమైన కఠినచర్యలు తీసుకోవాలని మల్లేశం ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు.

## రాష్ట్ర గిరిజన మోర్చ నాయకుని మృతిపట్ల ఎంపి ప్రగాఢ సంతాపం

**-బాధిత కుటుంబాన్ని పరామర్శించిన .మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్**

**శామీర్‌పేట, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:**

బిజెపి గిరిజన మోర్చ రాష్ట్ర నాయకులు కె.సుధాకర్‌నాయక్ ఆకస్మిక మరణం పట్ల మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ ప్రగాఢసంతాపం తెలిపి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. శనివారం మూడుచింతలపల్లి మండలంలోని లింగాపూర్‌తండ గ్రామాన్ని ఎంపి ఈటల రాజేందర్ సందర్శించి ఇటీవల మృతిచెందిన కె.సుధాకర్‌నాయక్‌కు ప్రగాఢ సంతాపం తెలిపి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన మృతి తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని, బాధాకరమని, బిజెపికి తీరని లోటని మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి బిజెపి అండగా ఉంటుందని, తన పూర్తిసహకారం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో శామీర్‌పేట ఉమ్మడి మండల మాజీ ఎంపిపి బి.చంద్రశేఖర్‌యాదవ్, మూడుచింతలపల్లి మండల బిజెపి అధ్యక్షులు టి.నరేందర్‌గౌడ్, బిజెపి మాజీ అధ్యక్షులు కైర యాదగిరి, లాల్‌గడిమలక్‌పేట్ కౌన్సిలర్ కైర గణేశ్, బిజెపి నాయకులు నరేందర్‌రెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, పలువురు బిజెపి నాయకులు, బాధితులు తదితరులు పాల్గొన్నారు.

# మేడ్చల్ నుంచి కొత్త రాజకీయ శంఖారావం

**-జనసందోహం మధ్య తెలంగాణ రాష్ట్ర సేన ఆవిర్భావ సభ**

**మేడ్చల్, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:**

మేడ్చల్ జిల్లాలోని మునీరాబాద్ గ్రామం తెలంగాణ రాజకీయాలకు కొత్త వేదికగా మారింది. గ్రామపరిధిలోని అద్వయ ఫంక్షన్ హాల్‌లో కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో నిర్వహించిన భారీసభలో నూతన రాజకీయ పార్టీగా తెలంగాణ రాష్ట్ర సేన (టిఆర్ఎస్) ఆవిర్భవించింది. దీంతో రాష్ట్ర రాజకీయాల్లో మరో కొత్త సమీకరణానికి నాంది పలికినట్లైంది. ఈసభకు భారీసంఖ్యలో ప్రజలు, మహిళలు, యువత, ఉద్యమకారులు, స్థానిక నాయకులు తరలివచ్చారు. వందలాది కార్లు, బస్సులు, ద్విచక్రవాహనాలు ఒకేసారి మునీరాబాద్‌వైపు రావడంతో ఔటర్ రింగ్ రోడ్డుతో పాటు పరిసర ప్రాంతాలన్నీ కిక్కిరిసిపోయాయి. కొంతసేపు ట్రాఫిక్ రద్దీ ఏర్పడి వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సభాప్రాంగణం పరిసర ప్రాంతాల్లోనూ సందడి వాతావరణం నెలకొంది.

ఒకప్పుడు తెలంగాణ ఉద్యమం, బిఆర్ఎస్ రాజకీయాల్లో కీలకపాత్ర పోషించిన కవిత ఇప్పుడు స్వతంత్ర రాజకీయదిశగా అడుగులువేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. పార్టీపేరును టిఆర్ఎస్ (తెలంగాణ రాష్ట్ర సేన)గా ప్రకటించడం ప్రత్యేక చర్చకు దారితీసింది. గతంలో తెలంగాణ రాష్ట్ర సమితి పేరుతో ప్రజల్లో నిలిచిన గుర్తింపును కొత్త రూపంలో తీసుకురావాలన్న ప్రయత్నంగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. సభలో మాట్లాడిన కల్వకుంట్ల కవిత తెలంగాణ ఉద్యమ లక్ష్యాలు మరుగునపడ్డాయని, ఉద్యమకారులకు సరైన గుర్తింపు దక్కలేదని విమర్శించారు. యువతకు ఉద్యోగాలు, మహిళలకు ప్రాధాన్యం, సామాజిక న్యాయం, గ్రామీణ అభివృద్ధి తమ పార్టీ ప్రధాన అజెండాగా ఉంటుందని ప్రకటించారు. అయితే సభకు ముందుగా ఊహించిన స్థాయిలో ప్రముఖ రాజకీయనేతలు హాజరుకాలేదన్న చర్చకూడా సాగింది. కొత్తపార్టీ ఆవిర్భావంకావడంతో రాష్ట్రస్థాయి కీలకనాయకులు, మాజీమంత్రులు, ప్రముఖ ప్రజాప్రతినిధులు వస్తారనే అంచనాలున్నప్పటికీ, కార్యక్రమంలో అలాంటి ముఖ్యనేతలు కనిపించకపోవడం చర్చనీయాంశమైంది. మేడ్చల్‌జిల్లాకుచెందిన కొంతమంది మాజీసర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, స్థానికనాయకులు మాత్రం సభకు హాజరయ్యారు. వారిని ఈకార్యక్రమానికి రావడానికిగల కారణంపై ప్రశ్నించగా, సభ ఎలా జరుగుతుందో చూడటానికి వచ్చామని చెప్పడం గమనార్హమైంది. దీంతో వారు పార్టీకి మద్దతుగా వచ్చారా, లేక రాజకీయ పరిస్థితులను అంచనా వేసేందుకా అన్న చర్చ స్థానికంగా సాగింది. ఈ కొత్త పార్టీ ప్రభావం ముఖ్యంగా భారత రాష్ట్ర సమితి(బిఆర్ఎస్)పై పడే అవకాశముందని రాజకీయవిశ్లేషకులు చెబుతున్నారు. అదేసమయంలో అధికారంలో కాంగ్రెస్ ప్రభుత్వానికీ ఇది కొత్త రాజకీయ సవాల్‌గా మారవచ్చని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మొత్తంగా మునీరాబాద్‌లో జరిగిన ఈసభ ఒకవైపు భారీజన సందోహం, ట్రాఫిక్‌రద్దీతో ఆకట్టుకోగా, మరోవైపు ప్రముఖనేతల గైర్హాజరు, స్థానికనాయకుల తటస్థ వైఖరి రాజకీయచర్చకు దారితీసింది. తెలంగాణ రాజకీయాల్లో కొత్త అధ్యాయం మొదలైందనే సంకేతాలు మాత్రం స్పష్టంగా కనిపించాయి.



సభలో పార్టీ పేరును ప్రకటిస్తున్న కల్వకుంట్ల కవిత

# జనాభా స్వీయ గణనను సద్వినియోగం చేసుకోవాలి

**-జిల్లా కలెక్టర్ దీపక్ తివారి**

**వికారాబాద్, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:**

విద్యావంతులు జనాభా స్వీయగణనను సద్వినియోగం చేసుకుని జనాభాగణనలో భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జనాభా స్వీయగణన ప్రక్రియ ఈనెల 26వ తేదీ నుండి మే 10వ తేదీ వరకు పోర్టల్ అందుబాటులో ఉంటుందని తెలిపారు. ప్రతి రోజు ఉదయం 6 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు ఈపోర్టల్‌లో జనాభాగణన వివరాలు 14 భాషల్లో నమోదు చేసుకోవచ్చని తెలిపారు. పోర్టల్ నమోదులో ఇంటి యజమాని ఫోన్ నెంబర్‌ను తప్పనిసరిగా ఇవ్వాల్సి ఉంటుందని, 33ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అన్ని ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చాక ప్రివ్యూ ఆప్షన్‌సైతం ఉంటుందని, అన్నిసమాధానాలు సరైనవి అనిపిస్తే ఫైనల్‌గా సబ్‌మిట్ చేయాలని సూచించారు. అనంతరం ఫోన్‌నెంబర్‌కు 11అంకెల ఎస్ఇఐడి కోడ్ వస్తుందని, మే10వతేదీ తర్వాత ఇంటింటికీ ఎన్యూమరేటర్లు వచ్చినప్పుడు స్వీయగణనకు సంబంధించిన 11అంకెలకోడ్‌ను చెబితే వెరిఫికేషన్ చేస్తారని తెలిపారు. జిల్లాలోని 20 మండలాలు, 4 మున్సిపాలిటీలకు సంబంధించి జనాభాగణనకోసం 1773 ఎన్యూమరేటర్లు, 304 సూపర్‌వైజర్లు ఏర్పాటు చేశామని తెలిపారు. దేశంలో ఎక్కడున్నా జనాభాగణన చేసుకోవచ్చని తెలిపారు. జనాభాగణనలో ఇచ్చే సమాచారం గోప్యతగా ఉంచబడుతుందని ఆయన స్పష్టంచేశారు. సందేహాలుంటే 1855 టోల్‌ఫ్రీ నెంబరుకు ఫోన్ చేసి సందేహాలు నివృత్తిచేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో అదపు కలెక్టర్ వెంకటచారి, సిపిఓ వెంకటేశ్వర్లు, మాస్టర్ ట్రైనర్ వీరకాంతం తదితరులు పాల్గొన్నారు.

**ఓటరు మ్యాపింగ్‌ను సమర్థవంతంగా నిర్వహించాలి: దీపక్ తివారి...**

వికారాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని గాంధీ కాలనీ, గంగారం వార్డులలో నిర్వహిస్తున్న ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ దీపక్ తివారి ఆకస్మికంగా పర్యటించి పరిశీలించారు. 2002 ఓటర్ జాబితాకు 2025 జాబితాను పరిగణలోకి తీసుకొని మ్యాపింగ్‌ను చేపట్టాలని బూత్‌స్థాయి అధికారులకు కలెక్టర్ సూచించారు. మ్యాపింగ్‌చేసే క్రమంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. కలెక్టర్ పర్యటనలో ఆయనవెంట జిల్లా అదనపు కలెక్టర్ వెంకటాచారి, ఆర్డీఓ వాసుచంద్ర, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎంపిడివో వినయ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ విక్రమసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.




మీడియా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ దీపక్ తివారి

# రైతన్నకు వెన్నుదన్నుగా తెలంగాణ ప్రభుత్వం

**-ఎంపి, ఎమ్మెల్యేల సుడిగాలి పర్యటన**

**-శంకర్‌కొండలో ఇందిరమ్మ ఇళ్ళు,**

**-ఆమనగల్లులో మాడల్‌హౌస్, వరి కొనుగోలుకేంద్రం ప్రారంభం**




ఇందిరమ్మ ఇంటిని ప్రారంభిస్తున్న ఎంపి మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డి

**ఆమనగల్లు, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:**

అన్నదాతలకు కాంగ్రెస్‌ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో తెలంగాణలో వ్యవసాయరంగం ఎంతో పురోగతి సాధిస్తుందని నాగర్‌కర్నూల్ పార్లమెంట్‌సభ్యుడు మల్లురవి, కల్వకుర్తి శాసన సభ్యుడు కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ప్రభుత్వ తోడ్పాటుతో నేడు తెలంగాణరాష్ట్రం ధాన్యభాండాగారంగా పేరుగాంచిందని వారు పేర్కొన్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలో శనివారం ఎంపి మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డి సుడిగాలి పర్యటన నిర్వహించి పలు కార్యక్రమాలలో పాల్గొన్నారు. సాయంత్రం ఆమనగల్లు మండలంలో పర్యటించి శంకర్‌కొండతండాలో ఇందిరమ్మ ఇళ్ళు, పట్టణంలోని మండలపరిషత్ ఆవరణలో ఇందిరమ్మ ఇళ్ళు మోడల్‌హౌస్, మార్కెట్‌యార్డులో పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరికొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ళపథకం అమలుతో పేదోడి సొంతింటికల సాకారమవుతుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం పారదర్శకంగా పథకాలను అమలుచేస్తుండడంతో అర్హులకే ప్రభుత్వ పథకాలు చెందుతున్నాయని కొనియాడారు. నియోజకవర్గంలో 3వేల పైగా ఇందిరమ్మ ఇళ్ళు మంజూరుకాగా, వీటిలో అధికశాతం నిర్మాణాలు పూర్తి కావస్తున్నాయని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం ఆమనగల్లు పట్టణంలోని మండలపరిషత్ కార్యాలయం సమీపంలో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ళు మోడల్‌హౌస్‌ను మున్సిపాలిటీచైర్మన్ పత్యానాయక్, మార్కెట్‌కమిటీ చైర్మన్ యాట గీతనర్సింహ్మా, స్థానికకౌన్సిలర్ ఎర్రవోలు మహేశ్‌లతో కలిసి వారు ప్రారంభించారు.

**కొనుగోలుకేంద్రాలలో మద్దతుధర పొందండి...**

రైతన్నలకు గిట్టుబాటు ధర కల్పించడం కోసమే రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని ఎంపి మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిలు అన్నారు. దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వం కల్పిస్తున్న మద్దతు ధరలతో లబ్దిపొందాలని సూచించారు. శనివారం ఆమనగల్లు పట్టణంలోని మార్కెట్‌యార్డ్ ఆవరణలో సింగిల్‌విండో ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలుకేంద్రాన్ని వారు పిఎసిఎస్ చైర్మన్ గంప వెంకటేష్‌గుప్తా, మార్కెట్‌కమిటీచైర్మన్ యాట గీతనర్సింహ్మా, మున్సిపాలిటీచైర్మన్ నేనావత్ పత్యానాయక్‌తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో వైస్‌చైర్మన్ సత్యం, కౌన్సిలర్లు మొక్తాల వెంకటయ్య, ఎర్రవోలు మహేష్, అనుముల రమేష్, మార్కెట్‌కమిటీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, టిపిసిసిసభ్యులు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, సర్పంచులు మండ్లీరాములు, గుర్రం కేశవులు, నిట్ట నారాయణ, మెకానిక్ బాబా, మార్కెట్‌కమిటీ డైరెక్టర్ వస్పుల శ్రీశైలం, మండలపార్టీ అధ్యక్షుడు జగన్, పట్టణ అధ్యక్షుడు మానయ్య, సింగిల్‌విండో సిఈవో దేవేందర్, సిబ్బంది పద్మాకర్‌రెడ్డి అల్లాజీ, మహేష్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ ఖాతాలను స్వాధీన చేసుకోండి

**శంకర్‌పల్లి, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:**

చందిప్ప మరకత శివాలయం ఆలయ కమిటీకి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కమిషనర్ దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఇచ్చిన 15 రోజుల గడువు దాటిందిని, నిబంధనల ప్రకారం ఆలయ ఖాతాలను స్వాధీన పరుచుకొని రికవరీ చర్యలు తీసుకొని హిందూ ధర్మాన్ని కాపాడాలని మరకత శివలింగ నామ కరణ భక్తుడు, ఆలయ పునః నిర్మాణ శ్రీకారకుడు, కోటి దీపోత్సవం భక్తి టివి ధర్మకర్త అవార్డు గ్రహీత, శంకర్‌పల్లి సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు ఆర్.నరేష్ కుమార్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కమిషనర్ దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఉన్నదాధికారులకు ఆలయంలో నిబంధనలకు విరుద్ధం గా జరిగిన ఆర్థిక లావాదేవలో జరిగిన అక్రమాలపై వెంటనే తదుపరి చర్యలకు ఉపక్రమించాలని, అలాగే ఆలయం మొదలు (2007) నుండి సమగ్ర విచారణ చేపట్టాలని నరేష్‌కుమార్ వినతిపత్రం అందించారు. చట్టరీత్యా వారిపై చర్యలుతీసుకునేలా ఎండోమెంట్‌శాఖ అధికారులకు, పోలీస్‌శాఖ అధికారులకు సిఫారసుచేసి, హిందూధర్మాన్ని కాపాడాలని నరేష్‌కుమార్ డిమాండ్‌చేశారు.



వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

## రోడ్డు ప్రమాదంలో ఉద్యోగి మృతి

**మొయినాబాద్, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:**

విధులుముగించుకుని ఇంటికి తిరుగుప్రయాణంలో ఉన్న ఉద్యోగి రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన విషాదఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దమంగరాల గ్రామానికి చెందిన మొల్ల హృదయరాజు(58) హైదరాబాదులోని కోఠిప్రాంతంలో సెంట్రల్ పబ్లిక్‌వర్క్స్ డిపార్ట్‌మెంట్‌లో ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. రోజువారీగా తన స్కూటీపై ఉదయం ఉద్యోగానికివెళ్లి, సాయంకాలం తిరిగి ఇంటికి వస్తుండేవాడు. ఈక్రమంలో శుక్రవారంరాత్రి సుమారు 7:30గంటల సమయంలో మొయినాబాద్ మున్సిపాలిటీపరిధిలోని జెబిఐటికళాశాల చౌరస్తావద్దకు చేరుకోగానే, గుర్తుతెలియని వాహనం వెనుక నుంచి వచ్చి అతని స్కూటీని ఢీకొట్టింది. దాంతో స్కూటీ డివైడర్‌ను ఢీకొని హృదయరాజు రోడ్డుపై పడిపోయాడు. ఈ ప్రమాదంలో అతనికి తలకు తీవ్రగాయాలు కాగా, చేతులు విరిగి శరీరంలోని ఇతరభాగాలకుకూడా బలమైనగాయాలు తగిలాయి. స్థానికులు వెంటనేస్పందించి, అతనిసెల్‌ఫోన్‌ద్వారా కుటుంబసభ్యులకు సమాచారం అందించి భాస్కర్‌ను ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అనంతరం లంగర్‌హౌస్‌లోని రేనోవా ఆసుపత్రికి మార్చగా, చికిత్సపొందుతూ రాత్రి 11:30గంటలకు మృతిచెందాడు. మృతుడి కుమారుడు మొల్ల ఆగస్టిన్ రాజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈఘటనతో గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది.

## బాబా రాందేవ్ జ్యుయెలర్స్‌ని పరిశీలించిన ఆర్ఐ



బాబా రాందేవ్ జ్యువెలర్స్‌ని పరిశీలిస్తున్న ఆర్ఐ విశ్వనాథం

**కీసర, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:**

ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలోని నాగారం డివిజన్ పరిధిలోని బాబా రాందేవ్ జ్యువెలర్స్ అండ్ పాన్ బ్రోకర్స్‌పై వచ్చిన ఫిర్యాదును పరిశీలించుందుకు శనివారం ఆర్ఐ విశ్వనాదం సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా బాధితురాలు సంతోషిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూ అధికారులు బాబా రాందేవ్ జ్యువెలర్స్‌లో తాకట్టు పుస్తకాలను పరిశీలించగా పలు కీలకలోపాలు గుర్తించబడ్డాయి. ముఖ్యంగా వడ్డీరేటు నమోదు చేయకపోవడం, బంగారం నాణ్యత వివరాలు నమోదు చేయకపోవడం, గ్రాస్‌వెయిట్ వివరాలు నమోదు చేయకపోవడం, ప్రస్తుత మార్కెట్ విలువ నమోదు చేయకపోవడం, అలాగే పాన్‌టికెట్ వెనుకభాగంలో అవసరమైన సంతకాలులేకపోవడం, టర్మ్స్ అండ్ కండిషన్స్ తప్పుగా నమోదు చేయబడినట్లు అధికారులు గుర్తించారు. పరిశీలన సమయంలో బాబా రాందేవ్ జ్యువెలరీ యాజమాన్యం అందుబాటులో లేకపోవడంలో తదుపరి విచారణను వచ్చే నెల 2వ తేదీన కొనసాగిస్తామని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ పంగ హరిబాబు మాట్లాడుతూ ఈ వ్యవహారంపై కఠినంగా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. సంబందిత లైసెన్స్‌ను వెంటనే రద్దుచేయాలని డిమాండ్ చేశారు. అలాగే తాకట్టు పెట్టబడిన నగలు చట్ట విరుద్ధంగా ఉన్నందున బాధితులందరికీ సమాచారం ఇచ్చి ఎలాంటి వడ్డీ లేకుండా వారి నగలను తిరిగి ఇవ్వాలని మాజీ కౌన్సిలర్ పంగ హరిబాబు కోరారు.

## చార్మినార్‌ను సందర్శించిన ఆదివాసీలు



**చార్మినార్,ఏప్రిల్ 25 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన నాలుగు వందల మందిఆదివాసీలు శనివారం హైదరాబాద్ పాతబస్తీని సందర్శించారు.శనివారం ఉదయం తొమ్మిది గంటల ప్రాంతంలో ఐదు బస్సులలో ఆదివాసీలు చార్మినార్‌కు చేరుకున్నారు.ఎంతో అద్భుతమైన చార్మినార్ కట్టడాన్ని ఆదివాఆదివాసీలు ఆసక్తితో తిలకించారు.చార్మినార్ లోపల నుంచి చార్మినార్ పరిసర ప్రాంతాలలోని చారిత్రక మక్కామసీదు.గాజుల విక్రయాలకు ప్రసిద్ధి గాంచిన లాడ్‌బజార్.యునానీ ఆసుపత్రి భవనాన్ని ఆదివాసీలు ఎంతో మక్కువతో చూశారు.చిన్న పిల్లలు, మహిళలు,యువకులు చారిత్రక చార్మినార్ అందాలు చూసి ఎంతో అనుభూతికి లోనయ్యారు.ఆదివాసీలకు మంగళ వాయిద్యాల నడుమ స్వాగతం పలికారు.డప్పుల వాయిద్యాల మధ్య శనివారం ఉదయం ఆదివాసీలు గింపులుగా చార్మినార్ ముందు పాటలు పాడుతూ ఆదివాసీల ప్రదర్శన నిర్వహించారు.చార్మినార్‌ను తిలకించిన అనంతరం ఆదివాసీలు చార్మినార్ వద్ద ఎంతో ఇష్టంతో చిరునవ్వులతో ఫోటోలు దిగారు.చార్మినార్ కట్టడం ఎంతో అద్భుతంగా ఉందని ఆదివాసీలు తెలిపారు.టూరిజం గైడ్లు ఆదివాసీలకు చార్మినార్ కట్టడం విశిష్టత గురించి వివరించారు. చార్మినార్, తారామతి బారామతి,లుంబీనీ పార్కు,శిల్పారామంను ఆదివాసీలు సందర్శించారని హైదరాబాద్-రంగారెడ్డి జిల్లాల టూరిజం అధికారి ప్రభాకర్ తెలిపారు.

## కాళేశ్వరంపై న్యాయం గెలిచి.. నిజం నిలిచింది : బిఆర్ఎస్



**అత్తాపూర్ ఏప్రిల్25,ప్రభాతవార్త :** కాళేశ్వరంపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అసత్యం ప్రచారాలపై బిఆర్ఎస్ పోరాటంతో న్యాయం గెలించి..నిజం నిలిచిందని కాటేదాన్ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్ ,మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు గుమ్మడి కుమార్ పేర్కొన్నారు.శక్రవారం విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ...హైకోర్టు స్టేను స్వాగతిస్తూ మోసపూరితంగా తీసుకొచ్చిన పీసీ ఘోష్ కమిషన్ నివేదికను కొట్టివేయడంతో ఈ ప్రభుత్వ ద్వంద వైఖరి బయటపడిందన్నారు. ఇది పీసీ ఘోష్ కమిషన్ నివేదిక కాదు పీసీసీ నివేదిక అని గతంలో చెప్పాడం జరిగిందని హైకోర్టు తీర్పుతో అక్షర సత్యం అని తేలిపోయిందని నీళ్ళు నిండి పైనుండి పోయినా నిల్చున్న మేడిగడ్డ బ్యారేజ్‌ను పట్టుకొని నానా మాటలు అన్నారని 60 ఏళ్లగా తెలంగాణకు నీళ్ళు ఇవ్వకుండా దోచుకున్న జల ద్రోహులకు ఈ తీర్పు చెంపపెట్టు మండిపడ్డారు.ఇక తాజాగా హైకోర్టు తీర్పుతో లక్షకోట్ల అవినీతి అన్న ఆరోపణలు గాల్లో కలిసిపోయాయి. దీనికితోడు ఒక్క మేడిగడ్డ మాత్రమే కాదు. మూడు బ్యారేజీలు పనికిరావు అన్న నోళ్లే ఇప్పుడు తమ్మిడిహట్టి నీళ్ల సుందిళ్ల బ్యారేజ్‌లో పోస్తామంటూ చెప్పడంతో కాంగ్రెస్ నేతలు, వారి తోడు దొంగలు బీజేపీ నాయకులు చేసిన ప్రచారమంతా బూటకమని, దురుద్దేశపూర్వకమని తేలిపోయిందన్నారు.ఈ సమావేశం లో రాజేష్ యాదవ్ , గంజి రాజు , మాచర్ల చిరంజీవి , ప్రవీణ్ ,అశోక్ కుమార్ , ఏర్వ మహేష్ , గురు స్వామి , మరియు తదితరులు పాల్గొన్నారు..

## 3న ఎర్రబోడలో హిందూ సమ్మేళనం



**అత్తాపూర్ ఏప్రిల్ 25,ప్రభాతవార్త :** అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని హైదర్ గూడ(ఎర్రబోడ)లో మే మూడో తేదీన నిర్వహించనున్న హిందూ సమ్మేళనం పోస్టర్‌ను స్థానికులు శనివారం విడుదల చేశారు. స్థానిక హైందవ సోదరులు ఎర్ర బోడ లోని బీరప్ప ఆలయంలో భారీ సంఖ్యలో తరలివచ్చి హిందూ సమ్మేళనం ఆహ్వాన పత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా హైందవ ప్రతినిధులు మాట్లాడుతూ... హిందూ సమ్మేళనానికి భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

### తెలంగాణ రక్షణ కోసం తమ పార్టీ ముందుంటుంది

**సైఫాబాద్, ఏప్రిల్ 25 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని మూడున్నర కోట్ల మంది ప్రజల రక్షణ కోసం తెలంగాణ రక్షణ సమితి (టిఆర్ఎస్-డి) అండగా నిలబడుతుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు నరాల సత్యనారాయణ స్పష్టం చేశారు. తమ పార్టీ మాటలు చెప్పి పబ్బం గడుపుకోదని, ఇచ్చిన హామీలను 100 శాతం అమలు చేస్తుందని, అధికారంలోకి రాబోయే తమ పార్టీయేనని ఆయన ధీమా వ్యక్తం చేశారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో వందలాది మంది కార్యకర్తల సమక్షంలో పార్టీ సూపర్ సిక్స్ మ్యానిఫెస్టోను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. తమ పార్టీ అధికారంలోకి రాగానే అభివృద్ధి, సంక్షేమ జోడెద్దులు లెక్కతో ముందుకు సాగుతుందన్నారు. రైతు, ఆరోగ్యన యువ రక్షణతోపాటు, ఉచిత విద్యా, మహిళా సంక్షేమం, జయశంకర్ ట్యాంటీన్‌లు, తెలంగాణ సబ్బండ వర్గాలకు అమలు చేస్తామన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి, మాజీ కెసిఆర్ మాయ మాటలతో ప్రజలను దోచుకున్నారని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా పార్టీని బలోపేతం చేస్తామని, అన్ని నియోజకవర్గాలకు కమిటీలను వేసి తమ మ్యానిఫెస్టోను ప్రచారం చేస్తామన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు శంకర్‌గౌడ్, ఆనంద్‌బాబు, నర్సింగ్, స్వరూప, సురేఖ, మారుతి, భాగ్యలక్ష్మి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

### సత్యనారాయణను పరామర్శించిన బండారు దత్తాత్రేయ

**యూసుఫ్‌గూడ ఏప్రిల్ 25 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రానికి చెందిన నీటి హక్కుల కార్యకర్త జలసాధన సమితి(జేఎస్ఎస్) సంస్థ వ్యవస్థాపకులు ఇటీవల గొర్రెల కాపరుల దాడికి గురై నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. శనివారం సత్యనారాయణను ఆస్పత్రిలో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, లయన్ డాక్టర్ చేకూరి హనుమంతు నాయుడు పరామర్శించారు. దూశర్ల సత్యనారాయణ ఎలిమినేటి మాదవరెడ్డి ప్రాజెక్టు పూర్తి చేయడం ద్వారా తెలంగాణలోని నల్గొండ జిల్లాకు తాగు నీటిని, సాగు నీటిని సరఫరా చేయడం కోసం దశాబ్దాల నుంచి పోరాడుతున్నాడు. ప్రత్యేక తెలంగాణ ఏర్పాటుకు మద్దతు ఇవ్వడంలో ఎంతో కృషి చేసిన వ్యక్తి అని అలాంటి వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతుండటంతో అతనికి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆయన త్వరగా కోలుకోవాలని వైద్య సదుపాయాలు కల్పించాలంటూ నిమ్స్ డైరెక్టర్ బీరప్పను కోరారు. ఈ కార్యక్రమంలో విద్యాసాగర్, అపర్ణ, డాక్టర్ లక్ష్మి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల రహిత తెలంగాణ కోసం అవగాహన ర్యాలీ

**సైఫాబాద్, ఏప్రిల్ 25 ప్రభాతవార్త:** మానవ జీవితాన్ని హరించే మత్తు పదార్థాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు శనివారం సాయంత్రం నగరంలో వందలాది మంది ప్రజలు 'మాదక ద్రవ్యాల వ్యతిరేక అవగాహన ర్యాలీ' నిర్వహించారు. జాతీయ మానవ హక్కులు, సామాజిక న్యాయ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఎన్‌సిసి, పోలీసులు, పోలీస్ అధికారులు, న్యాయవాదులు, జడ్జీలు, క్రీడాకారులు, మహిళలు, ఉద్యోగులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజా సంఘాల ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొని, ప్లకార్డులు చేబూని మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ ర్యాలీ నక్లెస్‌రోడ్‌లోని మాజీ ప్రధాని పి.వి.నరసింహారావు విగ్రహం నుంచి ప్రారంభమై సచివాలయం ఎదురుగా ఉన్న లుంబిని పార్కు వరకు కొనసాగింది. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు మాట్లాడుతూ మాదక ద్రవ్యాలపై ప్రతి ఒక్కరూ అవగాహనతో కలిగియుండాలని విజ్ఞప్తి చేశారు. మానవ ప్రాణాలను, కుటుంబాలను హరించే మాదకద్రవ్యాల అంతం కోసం ప్రతి ఒక్కరూ కంకణం కట్టుకుని ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు. మాదక ద్రవ్యాలను అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో కృషి చేస్తున్నాయని, అయినప్పటికి ప్రజల్లో అవగాహన ఉండాలని వారు సూచించారు. మాదక ద్రవ్యాల రహిత రాష్ట్రంగా తెలంగాణ రాష్ట్రాన్ని తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జాతీయ మానవ హక్కులు, సామాజిక న్యాయం సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు డా.సుక్కా డానియేల్, ఇండియా ఇన్‌చార్జి, రాష్ట్ర అధ్యక్షుడు సాగ్గు వేణుమాధవ్, రాష్ట్ర అధ్యక్షుడు బి.సరేందర్, ప్రతినిధులు ఎ.దామోదరగుప్తా, కాసల నాగరాజు, డా.వెంకన్నబాబు, పి.నాగేష్, కె.పి.శ్రీనివాసులు, దిలారి లక్ష్మి, వి.యాదవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.





మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా అవగాహన ర్యాలీ

## ఘనంగా పద్య నాటకోత్సవం

**చిక్కడపల్లి ఏప్రిల్ 25 ( ప్రభాతవార్త ) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ చలనచిత్ర, నాటకరంగ అభివృద్ధి సంస్థ సౌజన్యంతో, కల్పన కళా నికేతన్ అధినేత దొంతి జంగయ్య గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో "పద్య నాటకోత్సవం" అత్యంత వైభవంగా జరిగింది. ఈ ఉత్సవంలో భాగంగా ప్రదర్శించిన పౌరాణిక పద్య నాటకాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. శ్రీకృష్ణ రాయబారం నాటకంలోని "శయన దృశ్యంలో శ్రీకృష్ణుడిగా కర్నకోట మహేశ్వర్, దుర్యోధనుడిగా చిల్లీ బాలనాగేశ్వరరావు, అర్జునుడిగా దొంతి జంగయ్య గౌడ్ తమ అభినయంతో మెప్పించారు. కర్ణ రహస్యం లో శ్రీకృష్ణుడిగా పెర్మల వేదవ్యాస వెంకటేష్, కర్ణుడిగా దొంతి జంగయ్య గౌడ్ అద్భుతమైన పద్య పఠనంతో అలరించారు.కార్యక్రమంలో భాగంగా బేబి మాచా ఆద్య ప్రదర్శించిన కూచిపూడి నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రముఖ రంగస్థల నటులు, ఐ.ఎన్.టి. సెక్రటరీ డి. నాగేందర్ అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్య అతిథిగా ప్రముఖ కవి, రసమయి సంస్థ అధ్యక్షులు డాక్టర్ ఎం.కె. రాము హాజరై ప్రసంగించారు. విశిష్ట అతిథులుగా రిటైర్డ్ డిప్యూటీ ఫారెస్ట్ ఆఫీసర్ ఎన్. ఆనందం, అసెంబ్లీ సహాయ కార్యదర్శి బి. వీరారెడ్డి, ప్రముఖ నటులు బ్రహ్మశ్రీ డాక్టర్ జొన్నలగడ్డ జగన్మోహన్ రావు , అయోధ్య రామయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ నాటకాలకు ఎన్. భాస్కర్ రావు (సంగీతం), బి. పరమేష్ (మేకప్, ఆహార్యం) సహకారం అందించగా, ఎం. రమణాచారి వ్యాఖ్యాతగా వ్యవహరించారు. చిక్కడపల్లి ప్రాంత వాసులు, నాటక ప్రియులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ ప్రదర్శనలను తిలకించారు.



రంగస్థల కళాకారులను సత్కరించిన దృశ్యం

### రాష్ట్ర పండుగ వాసవిమాత జయంతి : అవోప అధ్యక్షుడు నమశ్శివాయ

**నాంపల్లి, ఏప్రిల్ 25 ప్రభాతవార్త :** ఆర్య వైశ్యుల సాంస్కృతిక వారసత్వం, భక్తుల భావాలను గౌరవిస్తూ రాష్ట్ర ప్రభుత్వం వాసవిమాత జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటించినందుకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, ప్రభుత్వానికి ఆర్యవైశ్య అధికారుల మరియు ప్రొఫెషనల్స్ అసోసియేషన్ అవోప, తెలంగాణ కృతజ్ఞతలు తెలిపారు. ఈమేరకు రెడ్‌హిల్స్‌లోని ఎఫ్‌టిసిసిఐలో జరిగిన కార్యక్రమంలో అవోప అధ్యక్షుడు ఆర్.నమశివాయ ప్రభుత్వ చారిత్రాత్మక నిర్ణయానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిర్ణయం ఆర్యవైశ్య సమాజానికి గర్వకారణం మాత్రమే కాకుండా శ్రీ కన్యకా పరమేశ్వరిదేవి ప్రేరణతో వచ్చిన సంప్రదాయ వారసత్వం, భక్తి విలువలు, సామాజిక సేవకు ప్రభుత్వమిచ్చిన గౌరవంగా నిలుస్తుందన్నారు. చివరిగా నగరంలోని రవీంద్రభారతి ప్రధాన మందిరంలో ఏప్రిల్ 26 ఆదివారం మధ్యాహ్నం 2గంటల నుండి కన్నులపండువగా వాసవిమాత జయంతి ఉత్సవం పెద్దయెత్తున నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటకశాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు సభాధ్యక్షతన జరగనున్న ఈ ఉత్సవానికి ముఖ్యఅతిథిగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, విశిష్ట అతిథులుగా కేంద్ర బొగ్గు, గనులశాఖల మంత్రి జి.కిషన్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ తదితర ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ కల్వ సుజాత, టిఎస్‌సిసి ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, తెలంగాణ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ కోలేటీ దామోదర్‌గుప్తా, బిజెపి తెలంగాణ ప్రతినిధి సుధాకర్ గండే, ఉప్పల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. వాసవిమాత ఆత్మార్పణ దినోత్సవంను కూడా అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఈ సందర్భంగా వారు విజ్ఞప్తి చేశారు.



సమావేశంలో పాల్గొన్న సుజాత, శ్రీనివాస్‌గుప్త, దామోదర్‌గుప్తా, నమశివాయ తదితర అతిథులు

## ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే కఠిన చర్యలు

**యూసుఫ్‌గూడ ఏప్రిల్ 25 ప్రభాతవార్త :** ప్రజా అవసరాల కోసం కేటాయించిన ప్రభుత్వ భూమిని కొందరు కబ్జాదారులు అక్రమంగా ఆక్రమించి నిర్మాణం చేపడుతున్నారు. అల్లాపూర్ డివిజన్ పరిధిలోని సర్వే నంబర్ 18 ప్రభుత్వ భూమి ఉండగా గత ప్రభుత్వ హయాంలో స్థానిక ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావు, మాజీ కార్పొరేటర్ సబీహా గౌసుద్దీన్‌లు ఆ స్థలాన్ని ఉర్దూ మీడియం స్కూల్ ఏర్పాటు చేసేందుకు అప్పటి మున్సిపల్ మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకువెళ్లారు. తొందర్లోనే అక్కడ ప్రజా అవసరాల కోసం స్థలం కేటాయించి నిర్మాణాలు చేపట్టాల్సి ఉండగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అక్కడ కబ్జారాయళ్లు రెచ్చిపోతున్నారు. తాజాగా కొందరు ప్రభుత్వ భూమిలో దర్జాగా బేస్‌మెంట్ నిర్మాణం చేపడుతున్నారు. సర్వే నంబర్ 18 ప్రభుత్వ స్థలం ఉండగా సర్వే నంబర్ 26 అంటూ నకిలీ పత్రాలు సృష్టించి కొందరు ఆ స్థలాన్ని విక్రయించటంతో సదరు నిర్మాణ దారుడు దర్జాగా నిర్మాణం చేపడుతున్నారు. స్థానికుల సమాచరంతో ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావు వెంటనే జిల్లా కలెక్టర్‌కు ఫోన్‌లో సమాచారం ఇవ్వగా తాహశీల్దార్‌కు, ఆర్‌ఐకి ఆ నిర్మాణాన్ని ఆపివేయాల్సిందిగా ఆదేశించారు. వెంటనే ఆర్‌ఐ అగస్టీన్ సంఘటనా స్థలానికి చేరుకుని అక్రమంగా ప్రభుత్వ భూమిలో నిర్మాణం చేపడుతున్న వ్యక్తులపై అల్లాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు అక్రమంగా నిర్మిస్తున్న నిర్మాణదారులను అదుపులోకి తీసుకున్నారు. ఆర్‌ఐ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా కొంత మంది రాత్రికి రాత్రే ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలంలో ఇళ్ల నిర్మాణాల వ్యర్థాలను డంపింగ్ చేస్తున్నారు. అంతేకాకుండా లారీలలో తెస్తున్న వ్యర్థాలను కొందరు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. అదేవిధంగా అక్రమంగా వాహనాలను పదుల సంఖ్యల్లో ఆ స్థలాలల్లో నిలపడంతో కొందరు ఆకతాయిలు ఆటోలు, కార్లలో కూర్చొని మత్తు పదార్థాలకు అలవాటు పడి గంజాయి సేవిస్తూ స్థానికంగా ప్రజలకు ఇబ్బందులకు గురిచేస్తున్నారు. వీటిపై కూడా పోలీసులు హెచ్చరిక నిఘా ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



అల్లాపూర్ సర్వే నంబర్ 18 ప్రభుత్వ భూమిలో ఆక్రమంగా నిర్మిస్తున్న నిర్మాణదారులు.

### పిల్లలు స్వేచ్ఛగా తమ సృజనాత్మకతను వ్యక్తపరుచుకునే అవకాశం కల్పించాలి : నర్సింగ్ రావు



**సైఫాబాద్, ఏప్రిల్ 25 ప్రభాతవార్త:** పిల్లలు స్వేచ్ఛగా తమ సృజనాత్మకతను వ్యక్తపరుచుకునేలా అవకాశం కల్పించాలని, అలా చేస్తేనే వారు కళల్లో రాణిస్తారని ప్రముఖ సినీ దర్శకుడు, చిత్రకారుడు బి.నర్సింగ్‌రావు చెప్పారు. బాల ప్రతిభాశాలి రిక్కి తేజ్ రూపొందించిన 'చార్కోల్ స్టోర్స్' కళా ప్రదర్శనను శనివారం నగరంలోని లమాకాన్ వేదికగా జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించి, ప్రసంగించారు. ముఖ్యంగా పౌరాణిక అంశాలపై రిక్కి తేజ్ చూపిస్తున్న సహజసిద్ధమైన జీవంతో నిండిన చార్కోల్ చిత్రాలు చాలా బాగున్నాయని ఆయన ప్రశంసించారు. భవిష్యత్తులో ఆయన ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. తెలంగాణ కళలకు పుట్టినిల్లు అని పేర్కొంటూ ఇలాంటి ప్రతిభను ప్రోత్సహించడంలో రాష్ట్రం ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సీనీయర్ జర్నలిస్టు వెంకటేశ్వరరావు, తెలంగాణ టుడే సంపాదికియ కార్టూనిస్టు నర్సిం, గ్రూప్-1 అధికారి సాహితి, ప్రధానోపాధ్యాయులు వేముల సైదులు, రిక్కి తేజ్ తండ్రి కట్టా కోటేశ్వరరావు పాల్గొన్నారు.

### హ్యాష్ ఆయిల్ విక్రయిస్తున్న ముగ్గురి అరెస్ట్

**జూబ్లీహిల్స్, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:** విశాఖపట్నం నుంచి నగరానికి నిషేధిత గంజాయి ద్రావణం(హష్ ఆయిల్) తీసుకొచ్చి విక్రయిస్తున్న ముగ్గురు నిందితులను జూబ్లీహిల్స్ జోన్ కమిషనర్ టాస్క్‌ఫోర్స్, జూబ్లీహిల్స్ పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళితే.. బండ్లగూడ జాగీర్‌కు చెందిన ప్రధాన నిందితుడు శంకరుల్ల అఖిల్(30) విశాఖపట్నంలోని అరకు ప్రాంతానికి చెందిన ఒక వ్యక్తితో పరిచయం పెంచు కొని హష్ ఆయిల్‌ను కొనుగోలు చేస్తున్నాడు. ఆ ఆయిల్‌ను నగరానికి తీసుకొచ్చి తన స్నేహితులైన రహమత్‌నగర్‌లో నివసిస్తూ చెఫ్‌గా పనిచేసే పోట్రేల్ సందీప్(25), వెంకట గిరికి చెందిన ప్రైవేటు ఉద్యోగి షేక్ అన్వర్‌ల ద్వారా నగరం లో అవసరమైన వారికి విక్రయిస్తున్నారు. ఇలానే శనివారం జూబ్లీహిల్స్ ప్రాంతంలో విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న క్రమంలో సమాచారం అందుకున్న పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ముగ్గురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 5ఎంఎల్ బాటిల్‌తో ఉన్న 45 సీసాలు, విడిగా సుమారు 185 గ్రాముల హష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. వారి వద్ద నుంచి మూడు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వాటి విలువ రూ. 1,02,500 ఉంటుందన్నారు. సులభంగా డబ్బులు సంపాదించాలని అడ్డదారుల్లో వెళ్లవద్దని, మాదకద్రవ్యాల వినియోగం వల్ల ఉద్యోగాలు, జీవితం కోల్పోతారని కమిషనర్ టాస్క్‌ఫోర్స్ డీసీపీ వైభవ్ గైక్వాడ్ సూచించారు. ప్రజలు మాదకద్రవ్యాలకు సంబంధించి ఎలాంటి అనుమానస్పద వస్తువులు, వ్యక్తులు కనిపించినా వెంటనే 100కు సమాచారం అందించాలన్నారు. ఆ దాడుల్లో వెస్ట్ జోన్ టా స్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ యదేందర్, జూబ్లీహిల్స్ జోన్ టాస్క్‌ఫో ర్స్ ఎస్ఐజి సందీప్‌రెడ్డి,పాల్గొన్నారు.

## కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు ప్రజలకు చేసింది శూన్యం

**-నిత్యం ప్రజలతో ఉంటూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నాం : బండి రమేష్**

**కెపిహెచ్‌బి కాలనీ, ఏప్రిల్ 25, ప్రభాతవార్త** ప్రజలకు అందుబాటులో లేని కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు నియోజకవర్గ ప్రజలకు చేసింది శూన్యమని, కూకట్‌పల్లి నియోజకవర్గ అభివృద్ధి ధ్యేయంగా నిత్యం ప్రజలతో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం తమ పార్టీ ద్వారా కృషి చేస్తున్నామని టీపీసీసీ ఉపాధ్యక్షులు కూకట్‌పల్లి కంటెస్టెడ్ ఎమ్మెల్యే బండి రమేష్ పేర్కొన్నారు. శనివారం మూసాపేటలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడుసార్లు హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా గెలుపొందానని సొంత డబ్బా కొట్టుకుంటున్న కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు నియోజకవర్గంలో ఉన్న సమస్యలను తీర్చడంలో పూర్తిగా విఫలమయ్యారని ధ్వజమెత్తారు. తన అనుచరుల ద్వారా కబ్జాల చేయిస్తూ, పరోక్షంగా అక్రమ నిర్మాణాలకు సహకరిస్తూ తనతో పాటు కింది స్థాయి నాయకులను ఎదిగేలా చేస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. అప్పటి మంత్రి విజయరామారావు ద్వారా కూకట్‌పల్లిలో డిగ్రీ కళాశాల ఏర్పాటు అయిందని, మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన కూకట్‌పల్లికి ఏ ప్రాజెక్టు తీసుకువచ్చారని ప్రశ్నించారు. ఆయన హయంలో 100 పడకల ఆసుపత్రి అట్టకి ఎక్కిందని, ట్రాఫిక్ సమస్యను తీర్చలేకపోయారని విమర్శించారు. ఎమ్మెల్యే తన షాడో ఆత్మ ద్వారా వారి అనుచరులతో సర్వీస్ రోడ్డులో కెపిహెచ్‌బి కాలనీలో, 9వ పేజ్‌లలో అక్రమంగా డబ్బాలు వేయించి డబ్బులు వసూలు చేస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగి చిరు వ్యాపాలను రోడ్లపై నుండి తొలగిస్తే మొసలి కన్నీరు కారుస్తూ వారికి అన్యాయం జరిగిందంటూ మున్సిపల్ కార్యాలయం దగ్గర అధికారుల వద్ద మొరపెట్టుకుంటూ నాటకాలు ఆడదం ఇక్కడి ప్రజలకు తెలుసని ఎద్దేవా చేశారు. బి.ఆర్.ఎస్ హయాంలో ఐడియల్ చెరువు వద్ద ఉన్న డబ్బాలను తొలగిస్తే ఇంతవరకు వారికి ప్రత్యామ్నాయం చూపలేదని అన్నారు. కెపిహెచ్‌బి కాలనీలో ఉన్న ఫిష్ మార్కెట్లో బి.ఆర్.ఎస్ పార్టీకి చెందిన దళారులతో వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. ప్రజా సమస్యలను తెలుసుకొని మూసాపేట వద్ద 180 కోట్లతో ఫ్లైఓవర్ నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. అదేవిధంగా ఇంటర్ నుండి పీజీ కాలేజీ నిర్మాణానికి అలాగే 100 పడకల ఆసుపత్రి కోసం తాము నివేదికలు తయారుచేసి పంపమన్నారు. అలాగే గోపాల్ నగర్‌లో పార్కు కోసం 3500 గజాల స్థలాన్ని హైడ్రా ద్వారా తాము కాపాడినట్లు వెల్లడించారు. దాదాపు 140 సంవత్సరాల చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి విషయంలో ఎప్పుడూ ముందుంటుందని బండి రమేష్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.





మీడియా సమావేశంలో పాల్గొన్న బండి రమేష్

## పేదలకు అండగా సంక్షేమ పథకాలు : ఎంపి, ఎమ్మెల్యే

**చిక్కడపల్లి ఏప్రిల్ 25, ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజాప్రభుత్వం ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్ అన్నారు. శనివారం ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. శనివారం బాగ్ లింగంపల్లి లోని హిమాయత్‌నగర్ తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో అర్హులైన లబ్దిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్‌తో కలిసి పంపిణీ చేశారు.అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ ఆడబిడ్డల పెళ్లిళ్ల తల్లిదండ్రులకు భారం కాకూడదనే ఉద్దేశంతో ప్రవేశపెట్టిన కళ్యాణ లక్ష్మి పథకం లక్షలాది కుటుంబాల్లో వెలుగులు నింపిందని కొనియాడారు. ఈ పథకాన్ని తమ ప్రభుత్వం కొనసాగిస్తూ ప్రజలను ఆదుకుంటుందన్నారు. కులమతాలకు అతీతంగా, అర్హతే ప్రాతిపదికన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని చెప్పారు. కార్యకర్తలు ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. ముఠా గోపాల్ మాట్లాడుతూ ముషీరాబాద్ నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు. ముషీరాబాద్ మండలంలో 328 మందికి, హిమాయత్‌నగర్ మండలంలో 65 మందికి చెక్కులు అందజేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకులు ముఠా జయసింహ, హిమాయత్‌నగర్ తాసిల్దార్ సంధ్యారాణి పాల్గొన్నారు.



కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ తో కలిసి పంపిణీ చేస్తున్న రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్

### చలివేంద్రాల నిర్వహణలో పరిశుభ్రత తప్పనిసరి: రాకేష్



చలివేంద్రం వద్ద పరిశుభ్రతను పరిశీలిస్తున్న రాకేష్

**జీడిమెట్ల, ఏప్రిల్ 25, ప్రభాతవార్త** వేసవికాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసే చలివేంద్రాలు ఎంతో ఉపయోగకరమని, వాటి నిర్వహణలో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని టిఆర్ఎస్ నాయకుడు జాలిగం రాకేష్ సూచించారు.శనివారంచింతల్ బస్ స్టాప్ వద్ద జాలిగం రాకేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందించే తాగునీరు స్వచ్ఛంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, చలివేంద్రాల వద్ద పరిశుభ్రతను కచ్చితంగా పాటించాలని స్వచ్ఛంద సేవకులకు సూచించారు.ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరిస్తూ చలివేంద్రాలను శుభ్రంగా నిర్వహిస్తే, వేసవిలో ప్రయాణికులకు ఎంతో ఉపశమనం కలుగుతుందని తెలిపారు.

### చిరువ్యాపారులను ఇబ్బందులు పెట్టడం న్యాయం కాదు : శంకర్ యాదవ్



**బేగంబజార్,ఏప్రిల్ 25 ప్రభాతవార్త:** బేగంబజార్ చేపల మార్కెట్ పరిసర ప్రాంతాలల్లో అక్రమంగాఏర్పాటు చేసుకున్న డబ్బాలను జిహెచ్‌ఎంసి,పోలీసుల సహకారంతో కూల్చివేశారు.శనివారంగోషామహల్ సర్కిల్ 30 టౌన్‌ప్లానింగ్ అధికారులు,పోలీసు సహకారంతో కూల్చి వేతలను మాజీ కార్పొరేటర్ జి.శంకర్‌యాదవ్ అడ్డుకున్నారు.ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలోపేద,మధ్యతరగతి కుటుంబాలు గత కొన్ని సంవత్సరాలుగా జీవనం సాగిస్తున్నాయన్నారు. వారికిఎలాంటి ముందస్తు నోటిసులు ఇవ్వకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా అకస్మాత్తుగా వచ్చి కూల్చివేయడం ఏంటి అని అధికారులను నిలదీశారు. ముందస్తు నోటిసులు ఇవ్వకుండాకూల్చివేతలు చేపట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు.అక్రమ నిర్మాణ భవనాలనుచేపడుతున్న కూల్చివేయకుండా నిరుపేద ప్రజలు డబ్బాలను ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్న వారి డబ్బాలను కూల్చివేయడం పట్ల తీవ్ర అగ్రహం వ్యక్తం చేశారు.కూల్చివేతలు చేపట్టడం ముందు వారికి ప్రత్యామ్నాయం చూపాల న్నారు.గోషామహల్ ఎసిపి ఎస్.సుదర్శన్‌ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ శ్రావణ్‌కుమార్ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.కాగా పేదలకు న్యాయం జరిగే వరకు బిజెపి పోరా డుతుందని స్పష్టం చేశారు.తక్షణమే కూల్చివేతలు ఆపివేయాలని,బాధితులకు న్యాయం చేయాలని జిహెచ్‌ఎంసి కమీషనర్ విజ్ఞప్తి చేశారు.

### బేగంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు ఉన్నత విద్యా ర్యాంకింగ్‌లో ప్రథమ స్థానం

**బేగంపేట ఏప్రిల్ 25,ప్రభాతవార్త**



బేగంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు మరో సారి ఉన్నత విద్యా ర్యాంకింగ్స్‌లో దేశంలోనే ప్రధమ స్థానం దక్కించుకుంది.2026.2027 విద్యా సంవత్సరానికి గాను ఉన్నత విద్యా ర్యాంకింగ్ లో దేశంలోనే ప్రధమ స్థానంలో నిల్చింది.న్యూ ఢిల్లీ లోని ది గ్రాండ్ హోటల్ లో జరిగిన వేడుకలలో కళాశాల ఎఫ్ ఏ సీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అప్పియా చిన్నమ్మ ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ డా.ఆనీ షెరాన్ ఎడ్యుకేషన్ వరల్డ్ అధినేతల చేతుల మీదుగా ప్రిన్సిపాల్ సర్టిఫికెట్,మెమెంటోను అందుకున్నారు.వరుసగా మూడవ సారి ర్యాంక్‌ని దక్కించుకోవడం హర్షణీయమని ,అంకిత భావంతో కృషి చేసే అధ్యాపకులు ,ఇష్టంతో చదివే విద్యార్థులు,నిరంతరం కళాశాల అభివృద్ధికి కృషి చేసే కార్యాలయ సిబ్బంది ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డా.కె.పద్మావతి నేతృత్వంలో ఈ విజయం సాధ్యమైందని ప్రిన్సిపాల్ అప్పియా చిన్నమ్మ అన్నారు.

### గాంధీనగర్ సంక్షేమ సంఘ అధ్యక్షులు రాఘవులు కన్నుమూత

**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 25 ప్రభాతవార్త** కుత్బుల్లాపూర్ రాజకీయ కురువృద్ధుడు గాంధీనగర్ సంక్షేమ సంఘ అధ్యక్షులు జల్దారాఘవులు అనారోగ్యంతో కన్నుమూశారు. ఇటీవలే తన 80వజన్మదిన వేడుకలను కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు, కుటుంబ సభ్యులమధ్య ఘనంగా జరుపుకున్న ఆయనకు అకస్మాత్తుగా అనారోగ్యానికి గురికావడంతో నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం ఉదయం నాలుగున్నర సమయంలో ఆయన తుదిశ్వాస విడిచారు. 1945లో జన్మించిన జల్దారాఘవులు తన 81వ ఏట తుదిశ్వాస విడిచారు. గాంధీనగర్ పారిశ్రామిక వాడ ఏర్పాటునుండి బస్తీగా ఏర్పాటైన నాటినుండి గాంధీనగర్ సంక్షేమసంఘ అధ్యక్షులుగా సుమారు ఐదు దశాబ్దాలు సంక్షేమసంఘ అధ్యక్షులుగా ఆయన విశేషసేవలు అందించి ప్రజల మన్ననలను పొందారు. కుత్బుల్లాపూర్ గ్రామపంచాయితీ వార్డు సభ్యులుగా తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించి సంక్షేమసంఘ వ్యవస్థాపక అధ్యక్షులుగా ఐదు దశాబాదలుగా కొనసాగుతూ చనిపోయేవరకు గాంధీనగర్ సంక్షేమానికి నిరంతరం కృషిచేసిన జల్దా రాఘవులు మరణవార్త విన్నవెంటనే గాంధీనగర్‌తోపాటు చుట్టుపక్కల కాలనీలు, బస్తీల వాసులు పెద్దఎత్తున తరలివచ్చి ఆయనకు నివాళులు అర్పించారు.శాసనసభ్యులు కె.పి. వివేకానంద్, రంగారెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ విజయ్‌శేఖర్‌గౌడ్‌లతో పాటు పలువురు ప్రముఖులు వచ్చి వారి కుటుంబసభ్యులకు తమ సంతాపాన్ని వ్యక్తంచేశారు.

### జూబ్లీహిల్స్‌లో ఇనుప రాడ్ల కారణంగా బెంజ్ కారు బోల్తా

**జూబ్లీహిల్స్ , ఏప్రిల్ 25, ప్రభాతవార్త:** రోడ్డు పక్కన నిర్మాణం కోసం నిర్లక్ష్యంగా ఉంచిన ఇనుప రాడ్ల కారణంగానే జూబ్లీహిల్స్‌లో బెంజ్ కారు బోల్తా పడినట్లు పోలీసులు గుర్తించారు.జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీకి చెందిన విద్యార్థి సాయి ఆకర్ష్ కళ్యాణం (20) మెర్సిడెస్ బెంజ్ సి300 కారు నడుపుతూ వస్తుండగా, ఎదురుగా వచ్చిన వాహనాన్ని తప్పించేందుకు ఎడమవైపు మళ్లించాడు. అయితే, ఆ ప్రాంతంలో జరుగుతున్న ఇంటి నిర్మాణ పనుల కారణంగా రోడ్డుపక్కన ఎలాంటి భద్రతా చర్యలు లేకుండా ఇనుప రాడ్లు ఉంచడంతో కారు వాటిని ఢీకొట్టింది.ఈ ఢీకొనడంతో ముందుభాగంలోని టైర్ పేలిపోవడంతో డ్రైవర్ వాహనంపై నియంత్రణ కోల్పోయాడు. అనంతరం కారు సమీపంలోని ఇంటర్నెట్ ఐరన్ పోల్‌ను ఢీకొని బోల్తా పడింది.ఈ ప్రమాదంలో ఎవరికి గాయాలు కాలేదు. అయితే కారు మరియు ఇంటర్నెట్ పోల్ దెబ్బతిన్నాయి. కారు నడుపుతున్న సాయి ఆకర్ష్‌కు నిర్వహించిన బ్రెత్ అనలైజర్ పరీక్షలో మద్యం సేవించలేదని తేలింది. రోడ్డు పక్కన నిర్మాణ సామగ్రిని నిర్లక్ష్యంగా వదిలేయడమే ఈ ప్రమాదానికి ప్రధాన కారణమని పోలీసులు నిర్ధారించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

### హెచ్ఎంటి సొసైటీలో యువకుడి ఉరి వేసుకుని ఆత్మహత్య

**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 25 ప్రభాతవార్త** కుత్బుల్లాపూర్ హెచ్ఎంటిసొసైటీలో నివాసముండే ఓ యువకుడు గుర్తుతెలియని కారణాలతో ఇంట్లో చున్నితో ఎఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ఖమ్మం జిల్లా వైరా మండలానికి చెందిన సత్యనారాయణరెడ్డి గతకొంతకాలంగా షాపూర్‌నగర్ హెచ్ఎంటి సొసైటీలో నివాసముంటూ ప్రైవేట్‌గా ఉద్యోగం చేస్తున్న సత్యనారాయణరెడ్డి ప్రైవేట్ ఉద్యోగి. గుర్తుతెలియని కారణాలతో ఇంట్లో ఫ్యాన్‌రాడ్‌కు చున్నీతో శనివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూలేని సమయంచూసి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు జీడిమెట్ల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేశ్ కేసు నమోదుచేసుకుని శవాన్ని పోస్టు మార్టం నిమిత్తం గాంధీఆసుపత్రికి తరలించారు.

### హత్యకేసులో నిందితుల అరెస్ట్

**సికింద్రాబాద్, ఏప్రిల్ 25 ప్రభాతవార్త:** చిలకలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన హత్యకేసులో ఇద్దరు నిందితులను చిలకలగూడ పోలీసులు అరెస్ట్ చేశారు. సికింద్రాబాద్ జోన్ డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ రక్షిత కృష్ణమూర్తి వివరాలను వెల్లడించారు. ముషీరాబాద్ భోలక్పూర్ ఇందిరానగర్ కు చెందిన నజ్ముద్దీన్ ఇలియాస్ జహంగీర్(35), మూషీరాబాద్ జమిస్తాన్‌పుర్కు చెందిన సయ్యద్ ఇలియాస్ (33)లు ఈనెల 23న సాయంత్రం పాత ఆర్థిక గొడవ కారణంగా పద్మారావునగర్లోని కేవీకే వైన్స్ వద్ద మహ్మద్ అలీమ్ (43)ను దారుణంగా పొడిచారు. తీవ్రంగా గాయపడ్డ అతన్ని గాంధీ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. నిందితులను శనివారం పోలీసులు వారిని అరెస్ట్ చేశారు. సమావేశంలో డిప్యూటీ డీసీపీ నర్సయ్య, చిలకలగూడ డివిజన్ ఏసీపీ శశాంక్‌రెడ్డి, చిలకలగూడ ఇన్స్పెక్టర్ వలిశెట్టి రామకృష్ణలు పాల్గొన్నారు.

## వ్యర్థ డ్రైనేజీ నీటితో పంటపొలాలకు నష్టం



వ్యర్థ డ్రైనేజీ జలాలు పొలాలకు పారుతున్న దృశ్యం

**ఘట్‌కేసర్, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:**
ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ అంకుశాపూర్ సమీపంలోని ఏసీఈ ఇంజనీరింగ్ కళాశాలనుంచి వెలువడుతున్న డ్రైనేజీనీటితో పంట పొలాలకు నష్టం వాటిల్లుతుందని ఘట్‌కేసర్ బిజెపి అధ్యక్షులు కొమ్మిడి మహిపాల్‌రెడ్డి ఆందోళన వ్యక్తంచేశారు. కళాశాలనుంచి బయటకు వదులుతున్న కలుషితజలాలు అంకుశాపూర్, చందుపట్లగూడలోని పంటపొలాలలోకి చేరి వ్యవసాయభూములు దెబ్బతీస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. కళాశాల యాజమాన్యం నిబంధనలు పాటించకుండా డ్రైనేజీ నీటిని ఇష్టానుసారంగా వదులుతుండటంతో మురికి చెరువుగా మారిందని తెలిపారు. భూగర్భజలాలు కలుషితం కావడంతో పాటు పశువులకు ప్రాణసంకటంగా మారిందని వాపోయారు. కళాశాలనుంచి వచ్చే మురికిని డ్రైనేజీ వ్యవస్థలోకి మళ్లించాలని ఆయన డిమాండ్ చేశారు. వ్యవసాయభూములోకి వ్యర్థాలు వదలకుండా అధికారులు కఠినమైన ఆదేశాలు జారీ చేయాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈసమస్య పరిష్కరించకుంటే స్థానికంగా ఇబ్బందులుపడుతున్న రైతులు ఆందోళనకు దిగుతామని హెచ్చరిస్తున్నారని మహిపాల్‌రెడ్డి స్పష్టం చేశారు.

## పరిశోధనలో సృజనాత్మక అవసరం



సదస్సులో మాట్లాడుతున్న ఓయూ ఇంజనీరింగ్ డీన్ కృష్ణయ్య

**ఘట్‌కేసర్, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:**
పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యను అభివృద్ధి చేయడం ఎంతో అవసరమని జెఎన్‌టియు రిజిస్ట్రార్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, ఉస్మానియా విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ ఫ్యాకల్టీ డీన్ ప్రొఫెసర్ ఎ.కృష్ణయ్య పేర్కొన్నారు. ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ ఘణాపూర్‌లోని కొమ్మూరి ప్రతాపరెడ్డి కళాశాలలో శనివారం ఐసిఎఫ్2టిఎం 26 అంతర్జాతీయ సదస్సు రెండోరోజు నిర్వహించారు. కేపీఆర్‌ఐటి, కేపీఆర్ ఐటీసిఓఈ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఫ్యూచర్ ఫ్రంటియర్స్ ఇన్ టెక్నాలజీ, ఇంజనీరింగ్ సైనెన్స్ అండ్ మేనేజ్ మెంట్ ఐసిఎఫ్2టిఈఎం 26కు ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిధిగా జెఎన్‌టియు రిజిస్ట్రార్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, ఓయూ ఇంజనీరింగ్ ఫ్యాకల్టీ డీన్ ప్రొఫెసర్ ఎ.కృష్ణయ్య హాజరై ప్రసంగించారు. ఈసందర్భంగా ఓయూ ఇంజనీరింగ్ ఫ్యాకల్టీ డీన్ ప్రొఫెసర్ ఎ.కృష్ణయ్య సన్మానించి పూలమొక్క, జ్ఞాపకాలను అందజేశారు. ఈకార్యక్రమంలో కేపీఆర్‌ఐటి చైర్మన్ కొమ్మూరి ప్రతాపరెడ్డి, వైస్‌చైర్మన్ కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి, స్ట్రాటజీ డైరక్టర్ కొమ్మూరి దివ్య, కేపీఆర్‌ఈఎస్ డైరక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ బి.సుధీర్ ప్రేమ్‌కుమార్, కేపీఆర్‌ఐటి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శ్రీనాథ్ కశ్యప్, కేపీఆర్‌ఐటీసీఓఈ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్‌రెడ్డి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎదులాబాద్ రైతు పరస్పర సహకార పొదుపు సంఘం కార్యవర్గం ఎన్నిక

**-అధ్యక్షులుగా గౌరీశంకర్ తిరిగి ఎన్నిక**



సంఘం అధ్యక్షులుగా ఎన్నికైన గౌరీశంకర్‌ను సన్మానిస్తున్న సభ్యులు

**ఘట్‌కేసర్, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:**
ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ ఎదులాబాద్ రైతు పరస్పర సహకార పొదుపు సంఘం అధ్యక్షులుగా కంట్లం గౌరీశంకర్ ఎన్నికయ్యారు. ఎదులాబాద్ లక్ష్మినారాయణ చెరువు కట్టమైసమ్మ ఆలయం ఆవరణలో సంఘం అధ్యక్షులు గౌరీశంకర్ అధ్యక్షతన 10వ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈసందర్భంగా సభ్యులు పలు అంశాలపై చర్చించి అవసరమైన తీర్మాణాలను ఆమోదించారు. సంఘంలో 80 మంది సభ్యులు ఉండగా ప్రతినెలా వంద రుపాయల చొప్పున 50 నెలలు చెల్లిస్తే పది వేయిలు అందించాలని నిర్ణయించారు. ఎదులాబాద్ రైతు పరస్పర సహకార పొదుపు సంఘం 2016 ఏప్రిల్‌లో స్థాపించి రైతులకు ఆర్థిక సహకారిగా తోడ్పాటును అందిస్తుందని 10 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సర్వసభ్య సమావేశం నిర్వహించి కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షులుగా తిరిగి కంట్లం గౌరీశంకర్‌ను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా కె.ప్రభాకర్‌చారీ, కార్యదర్శిగా పి.మాణిక్యం, సహాయ కార్యదర్శిగా ఎ.మురళీ, కోశాధికారిగా పి.సత్యనారాయణ, ముఖ్య సలహాదారుగా సింగారం సుక్కయ్యలను ఎన్నుకున్నారు. అనంతరం సుక్కయ్య ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని సన్మానించారు. సంఘం ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తీసుకోవడానికి జిల్లా కలెక్టర్‌కి వినతిపత్రం అందజేయాలని తీర్మాణం చేశారు. మేడ్చల్ జిల్లాలోని ఉద్దెమర్రి సహకార సంఘం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని నిర్వహిస్తున్నారని ఎదులాబాద్ సంఘం ద్వారా నిర్వహించేందుకు ప్రయత్నం చేయాలని ఆయన పేర్కొన్నారు.

## శ్యామ్‌రావుతండాలో ఉచిత వైద్యశిబిరం

**కేశంపేట, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:**
కేశంపేట మండల పరిధిలోని నిర్దవెల్లి గ్రామ పంచాయతీ శ్యామ్ రావు తండాలో శనివారం షాద్ నగర్ విజయ కార్డియాక్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ చందూలాల్‌రాథోడ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. తండాలోనీ ప్రజలకు షాద్‌నగర్ నుండి వచ్చిన వైద్య బృందం ఉచితంగా గుండె వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ చందూలాల్ రాథోడ్ మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. ప్రతిరోజూ వ్యాయామం చేయాలని, మద్యపానం, దోమపానంకు దూరంగా ఉండాలి అని ఆయన ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భాస్కర్ గౌడ్, ఉపసర్పంచ్ సఫూరా ఆమేర్, వార్డు సభ్యులు రమేష్, నాగరాజు, చంద్రయ్య, చెన్నయ్య, వెంకటమ్మ మల్లయ్య, రిజ్వానాబేగం మోహిజ్, నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ కవర్‌లను వాడొద్దని అవగాహన

**కీసర, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:**
ప్లాస్టిక్ కవర్‌లను వాడోద్దని భారత్ ఎన్విరాల్‌మెంట్ క్యాంపస్ మిషన్ ఆద్వర్యంలో నిర్వహిస్తున్న ఎర్త్ వీక్ కార్యక్రమంలో భాగంగా కొండాపూర్‌లోని విజ్ఞాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ టెక్నాలజీ ఫర్ ఉమెన్ కళాశాల విద్యార్థులు స్ఫూర్తి ఆర్గనైజేషన్ సహకారంతో శనివారం కీసరలో ప్లాస్టిక్ కవర్లకు బదులుగా పేపర్ బ్యాగులను ఉపయోగించాలని అవగాహన కార్యక్రమాన్ని కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు నిర్వహించారు. ఈ విద్యార్థులు స్వయంగా పేపర్ బ్యాగులను తయారు చేసి దుకాణదారులకు అందజేశారు. కొనుగోలుదారులు కూడా బ్యాగులను సంతోషంగా స్వీకరించారు.

# హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి భూమిపూజ

**-రూ.3.80 కోట్లతో హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి భూమిపూజ చేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**



నందిగామ వీర్లపల్లి గ్రామాల మధ్య హై లెవెల్ బ్రిడ్జిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**నందిగామ, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:**
హెచ్‌ఎండిఎ నిధులు రూ.3.80 కోట్లతో రెండు గ్రామాల మధ్య హై లెవెల్ బ్రిడ్జి నిర్మిస్తున్నందుకు సంతోషంగా ఉందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడారు. రోడ్డునిర్మాణంతో విద్యార్థులు, రైతులకు, వ్యాపారులకు, కార్మికులకు, కర్షకులకు, వాహనదారులకు సౌకర్యవంతంగా ఉంటుందని అన్నారు. ప్రజల ఆశీర్వాదం ఉన్నంతకాలం అభివృద్ధి లక్ష్యంగా.. ప్రగతి తన అభిమతంగా భావిస్తూ నియోజకవర్గాన్ని అన్ని మౌలిక సదుపాయాలతో.. పట్టణాలకు తీసిపోకుండా పల్లెలకు ప్రగతిదారులు వేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ రాములు, ఎంపిడివో అరుంధతి, ఎంపిఓ చక్రధర్ గౌడ్, మాజీ ఎంపిపి ఎం.శివశంకర్‌గౌడ్, నందిగామ, అప్పారెడ్డిగూడ సర్పంచులు కొమ్ము కృష్ణ, సి.మల్లేష్, వెంకమ్మగూడ సర్పంచి అశోక్, గబ్బు చవాన్, ఉపసర్పంచులు వెంకటేష్‌గౌడ్, సి.ప్రభు, నాయకులు పసుల బుచ్చయ్య, కుమార్‌గౌడ్, బుయ్యని వీరేందర్‌గౌడ్, గోవు రవికుమార్, పాతులవత్ శ్రీనునాయక్, కల్వకోలు శేఖర్‌గౌడ్, అప్పారెడ్డిగూడా నందిగామ గ్రామాలకు చెందిన వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

**రాజకీయ కక్ష సాధింపులు లేవు..**
**-ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పష్టం**

నందిగామ మండలంలోని ప్రతి ఊరు నా సొంత ఊరేనని, అభివృద్ధి తన అభిమతమని, గడచిన రెండేళ్ల కాలంలో ఎంతో అభివృద్ధి చేశానని, మాకు రాజకీయ కక్ష సాధింపులు లేవని ఎమ్మెల్యే, వీర్లపల్లి శంకర్ స్పష్టం చేశారు. శనివారం నందిగామ మండలంలో హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేయడం కోసం వచ్చిన ఆయన కాసేపు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వీర్లపల్లిలో జరిగిన పల్లె ప్రకృతి వనంలో మొక్కలు పీకేశారని రాద్ధాంతం చేయడం సరికాదన్నారు. ఆ స్థలంలో రూ.1 కోటి 75 లక్షలతో మల్టీపర్పస్ బిల్డింగ్ నిర్మాణం చేపట్టబోతున్నామన్నారు. అందరూ అభివృద్ధినీ స్వాగతించాలని, మొక్కల పంచాయతీ రాజకీయం చేయొద్దన్నారు. అవసరమైతే ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటామన్నారు.

# అఖిలభారత శాంతి సంఘీబావ సంఘం సమ్మేళనంలో స్పీకర్




శాంతి సంఘీభావ సమ్మేళంలో మాట్లాడుతున్న స్పీకర్ ప్రసాద్ కుమార్

**మోమిన్‌పేట్, ఏప్రిల్, 25. ప్రభాతవార్త:**
ప్రపంచానికి శాంతి సందేశాన్ని అందించిన దేశం బుద్ధుడు, మహాత్మగాంది లాంటి వారు అందించిన సందేశాలు, ప్రపంచంలో శాంతికోసం ఐక్యరాజ్య సమితి పిలుపుమేరకు జరుగుతున్న ఈసమావేశాలు చాలా సంతోషమని తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి, వికారాబాద్‌శాసనసభ్యులు గడ్డం ప్రసాదన కుమార్ పేర్కొన్నారు. శనివారం మోమిన్‌పేట్ మండల కేంద్రంలోని ఏజేఆర్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వ హించిన అఖిలభారత శాంతి సంఘీబావ సంఘం లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతు వేల సంవత్సరాలనాడే శాంతి సందేశాన్ని తీసుకుని బౌద్ధ మతం ఇతర దేశాలలో కూడా ఆధరణపొందిందని అన్నారు. మహాత్మా గాంధీ అహింసా అనే ఆయుదంతో పోరాటంచేసి దేశానికి స్వాతంత్ర్యంసాదించారని అన్నారు. మొదటినుండి మనది పరమత సహనం కల్గిన దేశం, ఇన్నివేల సంవత్సరాలలో భారతదేశంపై అనేక దండ యత్రలు యుద్దాలు చేయలేదు. హిందూ ధర్మంలో కూడా శరణువచ్చిన, సహాయం కోరి వచ్చిన వారికి శత్రువులను కూడా క్షమించాలని సూచించారు. గ్లోబరైజేషన్ తరువాత ప్రపంచంలో ఏ మూలనైనా యుద్ధం జరిగినా ఆ ప్రభావం ప్రపంచమంతటా ఉంటుంది. దీనితో ధరలు పెరిగి ప్రజలు ఇబ్బదులు పడుతున్నారు. మొదటి, రెండవ ప్రపంచ యుద్దాలతో జరిగిన అపార నష్టాన్ని ఈ ప్రపంచం చూసింది. ప్రపంచంలో శాంతి స్థాపన కోసం కృషి చేస్తున్న ఏపిఐఎస్‌ఓ సంస్థను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఏఐపిఎస్‌ఓ నేషనల్ అడ్వైజర్ చైర్మెన్ ఫీస్ అవార్డు గ్రహిత యాదవరెడ్డి, సుధాకర్, ఏఐపిఎస్‌ఓ జాతీయ అధ్యక్ష కార్యవర్గ సభ్యుడు కేవిఎల్ రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యధర్శి కొత్వాల్ ఒదేదుల్లా, రాష్ట్ర నాయకుడు మైనార్టీ కార్పోరేషన్ చైర్మెన్ డాక్టర్ తిప్పర్తి యాదయ్య, రాష్ట్ర అధ్యక్ష కార్యవర్గ సభ్యులు ఎం ఆర్ జి వినోద్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షవర్గ సభ్యులు నాగేశ్వర్‌రావు, రాష్ట్ర ప్రధాన కార్యధర్శి డాక్టర్ సమత, రాష్ట్ర ఉపాధ్యక్షులు సర్వోత్తంరెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు అమరెందర్ రెడ్డి, ఏఐపిఎస్‌ఓ వికారాబాద్ జిల్లా కమిటి ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బాలికలు ఉన్నత విద్యలో రాణించాలి

### మంత్రి దామోదర రాజనర్సింహ

**బుదేరా మహిళా కళాశాల తెలంగాణకు రోల్ మోడల్**

**మునిపల్లి, ఏప్రిల్ 25 (ప్రభాతవార్త):** బాలికలు ఉన్నత విద్యలో రాణించాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. శనివారం సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం బుదేరా సాంఘిక సంక్షేమ మహిళా రెసిడెన్సీయల్ కళాశాల వార్షికోత్సవంలో ఆయన పాల్గొన్నారు. బుదేరా మహిళా కళాశాల తెలంగాణలోనే నెంబర్ వన్ కళాశాలగా రూపు దిద్దుకుంటుందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో మూడు ప్రాంతాలకు మూడు మహిళా రెసిడెన్షియల్ కళాశాలలు మంజూరి కాగా తెలంగాణకు మంజూరి అయిన కళాశాలను తాను మునిపల్లి మండలల బుదేంలో ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. బుధేరా డిగ్రీ కళాశాల అన్ని హంగులతో రూపు దిద్దుకుంటుందని చెప్పారు. ఈ కళాశాల తెలంగాణలో రోల్ మోడల్ గా మారుతుందని దీనికై ఎన్ని నిధులైనా ఖర్చు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ప్రతి ఒక్క బాలిక వంద శాతం అక్షరాస్యత సాధించాలన్నదే ప్రభుత్వ ధ్యేయం అన్నారు. దేశంలోనే ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాను సాధించిన ఘనత తనదేనన్నారు. విధ్యార్థులు అంకిత భావంతో చదివి పురోగతి సాధించాలన్నారు. తల్లిదండ్రులు తమపిల్లల చదువు పట్ల శ్రద్ధ వహిస్తూ వారిని ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మాధవి, ఏ ఎంసి చైర్మన్ సుధాకర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు సతీష్, పాండు, బుచ్చిరెడ్డి, రహీం వెంకట్రాములు, సర్పంచులు మల్లేష్యాదవ్, అశోక్, బుడ్డ మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## గొంగ్లూర్‌లో వైద్య శిబిరం

**పుల్‌కల్, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:** మండల పరిధిలోని గొంగ్లూర్‌లో ఏఐజీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఇందిరా కాంతి పథకం ఆధీనంలో శనివారం మహిళలకు బ్రెస్ట్ క్యాన్సర్ ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో ద్వాక్రా మహిళా సంఘాల సభ్యులకు వైద్యులు బ్రెస్ట్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. బెస్ట్ క్యాన్సర్ నివారణకుఉ తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. గ్రామానికి చెందిన 60 మంది మహిళలు శిబిరంలో పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో ఐకెపి డీపీఎం రమేష్‌బాబు, ఏపీఎంలు వెంకట్, చంద్రశేఖర్, వీరేశం, రాంసాని రామచంద్రారెడ్డి, సర్పంచ్ శాగలేటి యాదగిరి, ఉపసర్పంచ్ శ్రీకాంత్‌గౌడ్, ఏఐజీ ఆసుపత్రి డాక్టర్లు కృపాలి, షారోన్ పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

**వెల్దుర్తి, ఏప్రిల్ 25, ప్రభాతవార్త :**
మండలంలోని మహమ్మద్‌నగర్ తండా గ్రామ పంచాయతీ పరిధిలో శనివారం ఐకెపి ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సర్పంచ్ చందర్, ఏపీఎం సుభాష్‌గౌడ్ ప్రారంభించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో సిసి స్వప్న, లక్ష్మణ్, సుల్తానా, విజయలక్ష్మి, ఉప సర్పంచ్ బాల్య, వార్డు సభ్యులు శ్రీను, గణేష్, గ్రామ పెద్దలు గోపియా, బిక్షపతి, హనుమంతు. రైతులు పాల్గొన్నారు.

**చిన్నచింతకుంటలో...**
**నర్సాపూర్, ఏప్రిల్ 25, ప్రభాతవార్త :** మండల పరిధిలోని చిన్న చింత కుంట గ్రామములో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సర్పంచ్ సరితమహేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సరితమహేష్ మాట్లా డుతూ ప్రస్తుత సీజన్లో రైతులు పండించిన పంటలను గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రంలోని విక్రయించాలన్నారు. ప్రభుత్వం రైతుల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని ధాన్యానికి గిట్టుబాటు ధర అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఐకెపి సి.సి నర్సిములు, ఉప సర్పంచ్ వజ్జె పెంటయ్య, వార్డు సభ్యులు సత్యనారాయణ, నరసింలు, నాయకులు పట్లోళ్ల శ్రీనివాస్, శ్రీకాంత్ రెడ్డి రైతులు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం

**నర్సాపూర్, ఏప్రిల్ 25, ప్రభాతవార్త :** ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తూ కార్మికులకు 11వ పిఆర్సీ అమలు చేయనున్నట్లు ప్రకటన చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఆర్టీసీ కార్మికులు శనివారం ఆర్టీసీ బస్ డిపోలో ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి టపాసులు కాల్చి మిఠాయిలు పంచుకొని సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ కార్మికుల జేఏసీ నర్సాపూర్ డిపోచైర్మన్ వెంకట్‌గౌడ్, కన్వీనర్ అశ్వక్, హైమద్, నాగరాజుగౌడ్, గోపాల్ ప్రేమ్‌కుమార్, శ్యాంకుమార్, శేఖర్ పాల్గొన్నారు.

## జన గణన నమూనా సర్వే ప్రారంభం

**వెల్దుర్తి, ఏప్రిల్ 25, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని అంగడిపేటలో అధికారులు శనివారం జన గణన నమూనా సర్వేను ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు చేపడుతున్న నమూనా సర్వేను డిఎఫ్ఓ జోజి సర్వేను పరిశీలించి సర్వేలో పాల్గొన్న అధికారులకు పలు సూచనలు చేశారు.

# రహదారుల నిర్మాణంతో సురక్షిత ప్రయాణం

**-పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి**



రోడ్డు పనులు పరిశీలించిన అనంతరం మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

**పరిగి, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:**
పరిగి నియోజకవర్గంలోని ప్రజల సురక్షిత ప్రయాణానికి ప్రభుత్వంచొరవతో పలు రహదారుల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేస్తామని, ఇప్పటికే రోడ్లపనులు ప్రారంభమయ్యాయని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. శనివారం పరిగి నుండి షాద్‌నగర్ వరకు జరుగుతున్న నాలుగులైన్ల రహదారి పనులను ఎమ్మెల్యే టిఆర్‌ఆర్ పరిశీలించారు. ఈసందర్భంగా పనుల నాణ్యత, పనుల వేగవంతంపై అధికారులతో ఫోన్‌ద్వారా మాట్లాడి, నిర్దిష్టగడువులో పూర్తిచేయాలని ఆదేశించారు. పరిగి నుండి షాద్‌నగర్ వరకు గతంలో సింగల్ రోడ్డు ఉండగా, దానిని డబుల్ రోడ్డు చేసి, ప్రస్తుతం నాలుగు లైన్లుగా విస్తరించేందుకు పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. పరిగి వికారాబాద్ వరకు నాలుగు లైన్ల రహదారి పనులు కొనసాగుతున్నాయని, లాల్‌పహాడ్ నుండి చిట్టెంపల్లి వరకు డబుల్ రోడ్డు, గడిసింగాపూర్ నుండి రంగారెడ్డిపల్లి వరకు డబుల్ రోడ్డు పనులు జరుగుతున్నాయని, త్వరలో పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. రీజినల్ రింగ్ రోడ్, రేడియల్ రోడ్లు పరిగి పట్టణానికి చేరువగా రానున్నాయని, ఓఆర్‌ఆర్ నుంచి షాబాద్-సయ్యద్‌పల్లి-మైలారం-బొంరాస్‌పేట్ మీదుగా కోస్గి వరకు కొత్త రహదారి ఏర్పడతుందని, త్వరలో పనులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. గత ప్రభుత్వం వికారాబాద్ జిల్లాలో, పరిగి నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధిని నిర్లక్ష్యం చేసిందని, ప్రమాదాలు పెరిగి ప్రజలు ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఎక్కువయ్యాయని అన్నారు. ముఖ్యమంత్రి, మంత్రుల చొరవతో పరిగి నియోజకవర్గానికి నాలుగు వైపులా రహదారుల నిర్మాణాలకు కృషి చేస్తున్నామని తెలిపారు. రానున్నరోజుల్లో గ్రామాలకు, తండాలకు కూడా రోడ్ల నిర్మాణాలు చేపడతామని ఆయన తెలిపారు.

## చలివేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే

**నందిగామ, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:**
భగభగమండే నిప్పుల కొలిమిలో వేడెక్కుతున్న వేళ.. రహదారులపై ట్రాఫిక్ విధులు నిర్వహించే పోలీసులకు, రహదారిపై వచ్చి పోయే బాటసారులకు, వాహనదారులకు చల్లటి చలివేంద్రం ద్వార గొంతు తడుపుతున్న సర్పంచ్ కొమ్ము కృష్ణ సేవలను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అభినందించారు. శనివారం మధ్యాహ్నం నందిగామ మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంగణంలో సర్పంచ్ కొమ్ము కృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శనివారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్వయంగా చల్లటి గ్లాసులో నీళ్లు పోసి ఇన్స్పెక్టర్ ప్రసాద్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఎం.శివశంకర్‌గౌడ్, మండలపార్టీ అధ్యక్షుడు జంగ నరసింహులు, ఉపసర్పంచ్ వెంకటేష్‌గౌడ్, వెంకమ్మగూడ సర్పంచ్ గోర్లపల్లి అశోక్, బండోనిగూడ కాంగ్రెస్ సీనియర్ పసుల బుచ్చయ్య, ఆగిరి రవికుమార్ గుప్తా, మాణిక్యం, వార్డు సభ్యులు బొమ్మ గళ్ళ నర్సింలు, అగ్గిప్రసాద్, నాయకులు బి.జంగయ్యగౌడ్, అన్వర్ పాషా, మాణిక్యం, సీతారాం, శివగళ్ల సుమన్, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరం విజయవంతం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

**కొడంగల్, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని చిన్ననందిగామ గ్రామంలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. హైద్రాబాద్‌లోని ఏఐజి ఆసుపత్రి వారి అద్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి గ్రామ ప్రజల నుండి విశేష స్పందన లభించింది. ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ దత్తాత్రేయరావు ప్రారంబించారు. ఏఐజి ఆసుపత్రి వైద్యులు గుండె, లివర్, కిడ్ని సంభందిత స్కానింగ్‌లు, రక్తపరీక్షలు, షుగర్ పరీక్షలు ఉచితంగా నిర్వహించగా 157 మంది పరీక్షలను చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఐజీ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ శశికళ, విద్య, సుష్మ, అభిషేక్, జమాన్‌లతో పాటు కోఆర్డీనేటర్లు శ్రుజన్, దేవాన్ష్, సునిత, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

## నిర్వాసితులకు చెక్కుల పంపిణీ

**కొడంగల్, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:**
కొడంగల్ మున్సిపల్ కేంద్రంలోని శ్రీమహాలోక్ష్మ వేంకటేశ్వర దేవాలయ పునఃనిర్మాణంలో భాగంగా ఇళ్ళు కోల్పోతున్న నిర్వాసితులకు మున్సిపల్ చైర్మేన్ నందారం ప్రశాంత్, మున్సిపల్ వైస్‌చైర్మేన్ శంకర్‌నాయక్, తహశిల్దార్ రాంబాబు చెక్కులను పంపిణీ చేశారు. శ్రీమహాలక్ష్మీ వేంకటేశ్వర దేవాలయపునఃనిర్మాణానికి ప్రభుత్వం రూ.110 కోట్లు మంజూరీ చేశారు. ఆలయ పునఃనిర్మాణంలో పలువురు ఇళ్ళు కోల్పోతున్నారు. ఇళ్ళు కోల్పోయిన నిర్వాసితులకు నష్టపరిమారంతో పాటు ఇళ్ళస్ధలాలను కేటాయించారు. అందులో భాగంగా ఇళ్ళు కోల్పోతున్న బాధితులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు శనివారం బాధితుల ఇంటి వద్దకు వెళ్ళి మున్సిపల్ చైర్మేన్, వైస్‌చైర్మేన్, తహశీల్దార్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కోఅప్షన్ సభ్యులు రమేష్‌బాబు, కాంగ్రెస్ నాయకులు బత్తుల నర్సింహ పాల్గొన్నారు.

## దోమల నివారణతో మలేరియా నిర్మూలన

**కొడంగల్, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:**
దోమల నియంత్రణ వల్ల మలేరియావ్యాధిని నిర్మూలించవచ్చని మున్సిపల్ చైర్మేన్ నందారం ప్రశాంత్, డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ రవీంద్రయాదవ్ అన్నారు. మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దోమలు వ్యాప్తిచెందకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమ తెరలు వాడి వ్యాధి నుంచి రక్షణ పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి బియ్యం అందజేత

**తలకొండపల్లి, ఏప్రిల్ 25, ప్రభాతవార్త;**
తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామనికి చెందిన నీరడి లక్షి ్మ దేవి (55), శనివారము మృతి చెందారు. లక్ష్మీ దేవి గత కొంత కాలంగా ఆనారోగ్యనికి గురై మృతి చెందడం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న వెల్జాల్ గ్రామ గౌడ సంఘం అధ్యక్షుడు తిరుమణి రాఘవేందర్ గౌడ్ మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంతరం వారికి వ్యక్తిగతంగా 50 కిలోల బియ్యం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు సుభాన్, నాయకులు, శ్రీశైలం గౌడ్, ఆంజనేయులు గౌడ్, రాచమల్ల భాస్కర్, సుదర్శన్, యాదగిరి, రాము, తదితరులు పాల్గొనడం జరిగింది.

## నేడు మనూర్‌లో హిందూ సమ్మేళనం

**మనూర్, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో ఈ నెల 26న సాయంత్రం 4గంటలకు హిందూ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిర్గాపూర్ మండలం అంతర్‌గామ్ ఆశ్రమ పీఠాధిపతి కరణ్ భారతీమహా రాజ్, ముఖ్య వక్తగా సంగారెడ్డి జిల్లా రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సహ కార్యవాహ కొప్పుల మహేందర్, మహిళా వక్తగా దుర్గా వాహిని కర్ణాటక ఉత్తరప్రాంత సహ సంయోజిక అనూసూజరెడ్డిలు హాజరువుతున్నారన్నారు. హిందూ సమ్మేళనానికి ప్రతి గడప నుంచి హిందువులు హాజరై కార్యక్ర మాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు వినతి చేశారు.

## వైభవంగా విగ్రహాల ప్రతిష్టాపన మహోత్సవం

**పూజలు చేసిన మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి**

**పాపన్నపేట, ఏప్రిల్ 25, ప్రభాతవార్త :** మండల పరిధిలోని కొంపల్లి గ్రామంలో గ్రామ దేవతల విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం మాజీ ఎమ్మెల్యే, బిఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎం.పద్మదేవేందర్‌రెడ్డి పాల్గొని గ్రామదేవతలు దుర్గాదేవి, పెద్దమ్మతల్లి, గంగమ్మదేవి, భూలక్ష్మిదేవి, నవగ్రహ, పోచమ్మ దేవి, నల్లపోచమ్మదేవి, కాళికాదేవి, ఎల్లమ్మదేవి, లింగామయ్య కాటమయ్య దేవతల విగ్రహాల ప్రతిష్ఠాపన హోమంలో పాల్గొని అమ్మవార్లను దర్శించు కొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జుకంటి పాపయ్య, ఉపసర్పంచ్పెంటయ్య, పాపన్నపేటమండల మాజీ సర్పంచ్ల ఫోరమ్ అధ్య క్షులు జగన్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్‌రెడ్డి నాయకులు తిరుపతిరెడ్డి, సోములు, వెంకటేశం, అంథోని బద్రి మల్లేశం పాల్గొన్నారు.

## కనుల పండువగా స్వామివారి కల్యాణోత్సవం

**పెద్దశంకరంపేట, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని గోదా సమేత లక్షీ ్మవెంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకలు రెండవ రోజు ఘనంగా నిర్వహించారు. శనివారం ఉదయం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలతో పాటు పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ధర్మకర్త విగ్రాం శ్రీనివాస్‌గౌడ్ దంపతుల ఆధ్వర్యంలో లక్ష్మివెంక టేశ్వరస్వామి కళ్యా ణోత్సవం వైభవంగా నిర్వహించారు. మంగళ వాయిద్యాల నడుమ స్వామి వారి కళ్యాణ మహోత్సవం ఘనంగా సాగింది. ఈ కార్యక్రమంలో కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రామ్ మహారాజ్, టిపిసిసి సభ్యులు కర్నె శ్రీనివాస్ శ్రీనివాస్, పట్టణ సర్పంచ్ జంగం రేణుక శ్రీనివాస్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవాలు ప్రారంభం

**చౌటకూరు, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో నెలకొన్న రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయ 4వ వార్షికోత్సవ ఉత్సవాలు శనివారం ప్రారం భం అయ్యాయి. గ్రామంలో అమ్మవారి వార్షికోత్సవ ఉత్సవాలకు అత్తారిం టికి వెళ్లిన గ్రామ ఆడడుచులు కుటుంబ సభ్యులతో గ్రామానికి చేరు కోవడంతో గ్రామంలో పండగ వాతావరణం నెలకొని సందడిగా మారింది. వార్షికోత్సవాలను పురస్కరించుకుని ఉదయం గోపూజ, గణపతి పూజ, ఆవాహిత దేవత పూజ, లక్ష్మి గణపతి హవనం పూజలు గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు.

## సద్గురు పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి మహోత్సవం

**మొయినాబాద్, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:**

సద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని మొయినాబాద్ మండల విశ్వకర్మ అధ్యక్షుడు సంతోష్‌కుమార్, గౌరవాధ్యక్షులు వడ్ల నరసింహచారి పేర్కొన్నారు. నేడు (ఆదివారము) మొయినాబాద్ మండల కేంద్రంలోని శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఆరాధన మహోత్సవం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈసందర్భంగా మండలంలోని ఆయాగ్రామాలలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి భక్తులకు ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమం విశ్వకర్మ మండల విశ్వబ్రాహ్మణ సంఘం వారి ఆధ్వర్యంలో అలంపురి కళావతి మోనాచారి కుటుంబసభ్యుల సమక్షంలో ఏర్పాటుచేయడం జరుగుతుందని, భక్తులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## మాజీ సర్పంచుల, ఎంపిటిసిల ఫోటో ఫ్రేమ్ ఆవిష్కరణ



ఫోటో ఫ్రేమ్‌ను ప్రారంభిస్తున్న ఎంపిఓ హన్మంత్‌రెడ్డి

**జిల్లెడుచౌదరిగూడ, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:**

జిల్లెడుచౌదరిగూడ మండలంలోని పద్మారంగ్రామంలో సర్పంచి మోహనాచారి ఆధ్వర్యంలో మాజీ సర్పంచుల ఎంపిటిసిలు ఫోటో ఫ్రేమ్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫోటో ఫ్రేమ్‌లను ఎంపిఓ హన్మంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో గ్రామానికి సేవలందించిన సర్పంచులు, ఎంపిటిసిల చిత్రపటాలను ఆవిష్కరించడం అభినందనీయమని అన్నారు. గ్రామప్రజలందరు ఐక్యంగా ఉండి గ్రామాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధిహామీ పనులు సద్వినియోగం చేసుకోవాలి

**-సర్పంచి ఆంజిలయ్య**



ఉపాధిహామీ కూలీలకు పలుసూచనలు చేస్తున్న సర్పంచి

**కుల్కచర్ల, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:**

వలసల నివారణకు ఉపాధిహామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచి ఆంజిలయ్య పేర్కొన్నారు. శనివారం మండలపరిధిలోని పుట్టపహాడ్ గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎండల పెరిగిపోవడంతో రైతులు ఉదయం సమయంలోనే పనులు పూర్తిచేసుకొని ఇంటికి చేరుకోవాలని సూచించారు. పని ప్రదేశాల్లో తాగునీరు తప్పకుండా తీసుకెళ్లాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచి లాల్‌బహుదూర్ శాస్త్రి, పంచాయతీ కార్యదర్శి కవిత తదితరులు పాల్గొన్నారు.

## అంతర్గత మురుగుకాలువ పనులు ప్రారంభం



అంతర్గత మురుగుకాలువ పనులు ప్రారంభిస్తున్న చలివేంద్రంపల్లి రాజు

**జిల్లెడుచౌదరిగూడ, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:**

జిల్లెడుచౌదరిగూడ మండలంలోని రావిర్యాల గ్రామంలో శనివారం అంతర్గత మురుగుకాలువ పనులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చలివేంద్రంపల్లి రాజు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో మురుగుకాలువలను నిర్మించటం వల్ల కాలనీలు సుందరంగా మారతాయని అన్నారు. అలాగే దోమల, ఈగల బెడద ఉండదని పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి విడుదల అవుతున్న నిధులతో గ్రామాలలో అభివృద్ధిపనులు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి నీలయ్య పాల్గొన్నారు.

## ప్రతి రైతుకు ఐడి రిజిష్ట్రేషన్ తప్పనిసరి

**-మేడ్చల్ జిల్లా వ్యవసాయ అధికారిణి చంద్రకళ**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:**

ప్రతి రైతుకు ఐడి రిజిష్ట్రేషన్ తప్పనిసరి అని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రైతులు లబ్ధిపొందాలంటే రైతులు ఐడి రిజిష్ట్రేషన్ (ఫార్మర్‌గా) చేసుకోవాలని మేడ్చల్ జిల్లా వ్యవసాయ అధికారిణి కె.చంద్రకళ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలోని ప్రతి ఫార్మర్ రైతులు విధిగా ఐడి రిజిష్ట్రేషన్‌ను అగ్రి స్టాక్ (తెలంగాణ ఫార్మర్ రిజిస్ట్రి)లో నమోదుచేసుకోవాలని సూచించారు. పత్తి, వరికొనుగోలు, పంట రుణాలకు ఇది కీలకంగా ఉంటుందన్నారు. ఆయా మండలాల వారీగా రైతులు తమ పరిధిలోని అగ్రికల్చర్ ఎఈఓల వద్ద (రైతువేదికలలో) లేదా దగ్గరలోని అన్ని మీ-సేవాకేంద్రాల్లోనూ నమోదు చేసుకోవచ్చన్నారు. రైతులందరు తప్పనిసరిగా ఫార్మర్ రిజిష్ట్రేషన్ చేయించుకునేందుకు ముందుకు రావాలని జిల్లా వ్యవసాయ అధికారిణి కె.చంద్రకళ సూచించారు.

## మిషన్ భగీరథ నీటితో ఆరోగ్యం

**-మిషన్ భగీరథ డిఈ హారిక**

**షాబాద్, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:**

మిషన్ భగీరథ నీటిని త్రాగడం ద్వారా ఆరోగ్యంగా ఉంటామని మిషన్ భగీరథ డిఈ హారిక అన్నారు. జల అర్పణ దివాస్ సందర్భంగా మండల పరిధిలోని కొమరబండగ్రామంలో సర్పంచి కుక్కల పద్మమ్మగోపాల్, మిషన్ భగీరథ ఎఈ చంద్రమోహన్‌రెడ్డిలతో కలిసి గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మార్కెట్లో దొరికే ప్యాకెట్ వాటర్ వాడటంవల్ల మంచినీటిలో ఆర్వో వాటర్ ఖనిజ లవణాలు నశిసాయని, కాని మిషన్ భగీరథ నీటిని శాస్త్రీయంగా శుద్ధిచేసి, తాగడంవల్ల శరీరానికి కావల్సిన పోషకాలను ఉంచుతుందన్నారు. మిషన్ భగీరథ నీరు తాగడం వల్ల ఎముకల పుష్టి పురుగుతుందని, కలుషిత నీటి ద్వారా వచ్చే వ్యాధులను అరికట్టవచ్చని అన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచి శేఖర్, పంచాయతీ కార్యదర్శి శంకర్, మిషన్ భగీరథ సిబ్బంది, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మికతతో శాంతికి మార్గం

**ఆమనగల్లు, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:**

ఆధ్యాత్మికత అలవాటు సమాజంలో శాంతిస్థాపన సాధిస్తుందని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సిఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. మానవీయ విలువలు పెంపొందేందుకు దోహదపడుతుందని చెప్పారు. శనివారం ఆమనగల్లు మున్సిపాలిటీపరిధిలోని పెంటతండాశివారు హనుమాన్ దేవాలయంలో సుంకిరెడ్డి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయ మర్యాదలతో పూజారులు సుంకిరెడ్డికి స్వాగతం పలికారు. అనంతరం ఆలయ మూలవిరాట్‌ను దర్శించుకుని పూజలుచేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈసందర్భంగా సుంకిరెడ్డి ఆలయ పరిసరాలను, ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. కార్యక్రమంలో గాజులు శ్రీను, రూపం వెంకట్‌రెడ్డి, కమటం శేఖర్, ఐక్యత ఫౌండేషన్ ప్రతినిధులు శివ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# మండలాభివృద్ధికి నిధుల వరద

**-రూ.2732 లక్షల నిధులు విడుదల**



రావిర్యాల గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న వంతెన పనులు

**జిల్లెడుచౌదరిగూడ, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:**

మండలాభివృద్ధికి ప్రభుత్వం సహకరించడం వల్ల నిధులు వరదలా వస్తున్నాయి. ఈ నిధులతో అనేక నూతనపనులకు శ్రీకారంచుట్టారు.

**మండలానికి విడుదల చేసిన నిధులు...**

జిల్లెడుచౌదరిగూడ మండలంలోని 24గ్రామ పంచాయతీలకు ఆయాశాఖల ద్వారా నిధులు మంజూరు అయ్యాయి. మండలంలోని చేగిరెడ్డి ఘనాపూర్ గ్రామంలో 7పనులకు రూ.40లక్షలు, చింతకుంటతాండాకు 4పనులకు రూ.21లక్షలు, చౌదరిగూడగ్రామానికి 41పనులకు రూ.503.05లక్షలు, ధర్మ్యాతాండాకు 4పనులకు రూ.27లక్షలు, ఎదిరగ్రామానికి 8పనులకు రూ.33.50లక్షలు, ఎల్కగూడగ్రామానికి 12పనులకు రూ.196లక్షలు, గాలిగూడగ్రామానికి 9పనులకు రూ.55లక్షలు, గుంజల్‌పహాడ్‌గ్రామానికి 11పనులకు రూ.305.50 లక్షలు, గుర్రంపల్లిగ్రామానికి 8పనులకు రూ.164.50లక్షలు, ఇంద్రానగర్‌గ్రామానికి 3పనులకు రూ.13లక్షలు, జాకారంగ్రామానికి 15పనులకు రూ.80లక్షలు, జిల్లెడుగ్రామానికి 7పనులకు రూ.37లక్షలు, కాస్లాబాద్‌గ్రామానికి 9పనులకు రూ.65లక్షలు, లచ్చంపేటగ్రామానికి 10పనులకు రూ.66.50లక్షలు, ముష్టిపల్లిగ్రామానికి 3పనులకు రూ.19లక్షలు, పద్మారంగ్రామానికి 8పనులకు రూ.32లక్షలు, పెద్దఎల్కిచర్లగ్రామానికి 11పనులకు రూ.55.50లక్షలు, ఫీర్జాపూర్‌గ్రామానికి 6పనులకు రూ.28లక్షలు, రావిర్యాలగ్రామానికి 16పనులకు రూ.454.50లక్షలు, తూంపల్లిగ్రామానికి 9 పనులకు రూ.108లక్షలు, తుమ్మలపల్లిగ్రామానికి 9పనులకు రూ.41లక్షలు, వాచ్యతాండాకు 4పనులకు రూ.98లక్షలు, వనంపల్లిగ్రామానికి 6పనులకు రూ.33.50లక్షలు, వీరన్నపేటగ్రామానికి 7 పనులకు రూ.256లక్షల నిధులు మంజూరు అయ్యాయి. మండలంలోని అన్నిగ్రామపంచాయతీలకు 229నూతన పనులకు రూ.2732.55లక్షల నిధులు మంజూరు అయినట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఆయాగ్రామాలలో నూతన పనులు ప్రారంభం అయినట్లు వారు తెలిపారు. గ్రామానికి నూతనవంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేసినందుకు గ్రామప్రజలు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు కృతజ్ఞతలు తెలియజేసారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందాం




చందన్‌వెల్లి పిహెచ్‌సిలో ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్లు, ఆశాలు

**షాబాద్, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:**

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంచుకొని, మలేరియాను తరిమేద్దమని షాబాద్ వైద్యాధికారిణి డాక్టర్ తబుసుమ్ అన్నారు. శనివారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా షాబాద్ పిహెచ్‌సి వద్ద అవగాహన సదస్సు నిర్వహించి, ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని దోమలుపుట్టకుండా, కుట్టకుండా చూసుకొని మలేరియా రాకుండా చూడాలన్నారు. దోమతెరలను వాడాలని, పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. చికిత్సకన్నా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది శ్యాం, తాహెర్, శ్రీధర్, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం



ఆమనగల్లులో సిఎంచిత్రపటానికి పాలతో అభిషేకంచేస్తున్న ఆర్యవైశ్యులు

**ఆమనగల్లు, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:**

ఆర్యవైశ్యుల కులదైవం శ్రీవాసవిమాత జయంతిని తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ప్రకటించడంతో ఆమనగల్లు ఆర్యవైశ్యసంఘం హర్షం వ్యక్తం చేసింది. మార్కెట్ కమిటీ డైరెక్టర్ కండె పాండురంగయ్య, ఆర్యవైశ్యసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వీరబొమ్మ రాంమ్మోహన్‌గుప్త ఆధ్వర్యంలో ఆమనగల్లులో శనివారం సంబురాలు జరిపారు. గాంధీపార్కులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటాన్ని ఏర్పాటు చేసి క్షీరాభిషేకంతో ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. శ్రీవాసవిమాత ఆశీస్సులతో రాష్ట్రం మరింత సుభిక్షంగా విరాజిల్లాలని, ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని కండె పాండురంగయ్య ఆకాంక్షించారు. కార్యక్రమంలో అర్యవైశ్య సంఘం ప్రతినిధులు కండెసాయి, మేడిశెట్టి శ్రీధర్, అర్థం లక్ష్మయ్య, మెండెం చంద్రశేఖర్, బికుమాండ్ల శ్రీనివాస్, జూలూరి సతీష్, పాపిశెట్టి అరవింద్, పసుపుల జగన్, విడియాల రవి, బొజ్జ నర్సింహ్మ, ఉప్పల శ్రీధర్ తదితరులు ఉన్నారు.

## బూర్గుల వృద్ధాశ్రమంలో అన్న వితరణ

**షాద్‌నగర్, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:**

కమ్మ సమైక్య వేదిక ప్రధాన కార్యదర్శి మాకినేని వెంకట నారాయణ జన్మదినం సందర్భంగా ఫరూక్ నగర్ మండలం బూర్గుల గ్రామంలోని చైతన్య సేవ వృద్ధాశ్రమంలో అన్న వితరణ, ఫ్రూట్స్ పంపిణీచేశారు. ఈసందర్భంగా ఆశ్రమ నిర్వాహకులు ప్రహ్లాదరావు, ఆశ్రమ సిబ్బంది వృద్ధులకు సేవచేసే కార్యక్రమంలో భాగస్వామ్యం అయినందుకు వెంకట్ నారాయణని అభినందించారు. ఈకార్యక్రమంలో కమ్మ సమైక్య వేదిక అధ్యక్షులు మన్నవ సాంబశివరావు, ఉపాధ్యక్షులు మదమంచి ఆనందరావు, వైకుంఠ సాంబశివరావు, దొడ్డి శ్రీనివాస్, ఆశ్రమ సిబ్బంది పాల్గొన్నారు.

## 42 రోజుకు చేరిన భూనిర్వాసితుల ధర్నా



రైతులతో మాట్లాడుతున్న మాకామ్ సభ్యులు

**యాచారం, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:**

యాచారం మండల పరిధిలోని కురమిద్ద అనుబంధ గ్రామమైన మర్లకుంట తండాలో 42రోజులుగా జరుతున్న నిరసన దీక్షకి సంఘీభావం తెలుపటానికి జాతీయ మహిళా రైతుల హక్కుల వేదిక (మాకామ్) జాతీయ కమిటీ సభ్యులు ఆశాలత, మకాం సభ్యుల పిలుపు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు జనార్ధన్, చైతన్య మహిళాసంఘం సభ్యులు పి.గిరిజ శిబిరానికి వచ్చారు. వారు అక్కడ దీక్ష చేస్తున్న రైతులతో మాట్లాడి వారి సమస్య వివరాలు పూర్తిగా తెలుసుకుని, ఫార్మాసిటీ రైతుల ఉద్యమానికి తమసంస్థల తరపున పూర్తిమద్దతు ఉంటుందని, ఇకముందు కూడా ఉద్యమంలో ఇక్కడి రైతులకి, కూలీలకి ఉద్యమంలో పాల్గొంటామని తెలియచేసారు. రైతులు కూడా మాకామ్ సభ్యుల మద్దతుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కురమిద్ద సర్పంచి శ్రీవిద్య, ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు, మర్లకుంట, మంగళ్లగడ్డ, పోతూబండ తండా, కురమిద్ద రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా స్వామివారి పల్లకీసేవ



స్వామివారి పల్లకీసేవ దృశ్యం

**షాద్‌నగర్, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:**

షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని సోలిపూర్ చౌడమ్మగుట్ట శ్రీఆంజనేయస్వామి దేవాలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భజన భక్తబృందం సభ్యుల ఆధ్వర్యంలో స్వామివారి పల్లకీసేవ ఘనంగా నిర్వహించారు. శ్రీఆంజనేయస్వామి విగ్రహాన్ని పల్లకీలో మోస్తూ శ్రీరామ జయరామ, జయజయరామ నినాదాలతో ఆటపాటలతో, భజనలతో భక్తులు పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు రఘుపతి రావు, రాఘవేంద్రాచార్య, అర్చకులు, ప్రమోద్, సునీల్‌పంతులు ఆధ్వర్యంలో భక్తులకు ప్రత్యేకపూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. షాద్‌నగర్ సిఐ కె.సీతారాం దంపతులు శ్రీఆంజనేయస్వామికి ప్రత్యేకపూజలు నిర్వహించి పల్లకీసేవలో పాల్గొన్నారు. ఈసందర్భంగా వారిని దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో శాలువా పూలమాలతో సన్మానించారు. అదేవిధంగా మున్సిపాలిటీ 6వవార్డు మాజీకౌన్సిలర్ పులిమామిడి లతాశ్రీ శ్రీశైలంగౌడ్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో దేవాలయానికి వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా అన్నదానంచేసిన మాజీ కౌన్సిలర్ పులిమామిడి లతాశ్రీ శ్రీశైలంగౌడ్ కుటుంబసభ్యులను పూలమాలతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. మండువేసవిలో భక్తుల దాహార్తి తీర్చేందుకు దాత బొట్టు రమేష్ చల్లని మంచినీటిని భక్తులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీసర్పంచి పులిమామిడి శ్రీశైలంగౌడ్, జి.వసంతరావు, అన్నారం రఘుగౌడ్, గడ్డమీద రమేష్ ముదిరాజ్, శంకర్‌గౌడ్, లక్ష్మారెడ్డి, యాదగిరి, తులసిరామ్, రఘునందన్‌రెడ్డి, సుప్ప నర్సింలు, నారాయణ, వీర్లపల్లి కృష్ణయ్య, శంకరయ్య, వీఆర్వో బచ్చన్న, సుప్ప కృష్ణయ్య, పి.ప్రవీణ్‌గౌడ్, పద్మావెంకటేష్, జగన్, గోరియా నాయక్, కొత్త సత్తయ్యగౌడ్, శ్రీనివాస్, రమేష్, రవి, హనుమంత్‌రెడ్డి, రవీందర్, నరసింహులు, మాజీ వార్డు సభ్యులు సింగపాగ లక్ష్మయ్య, భజన భక్త బృందం మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు

**-రహదారుల ఏర్పాటుతోనే గ్రామాలు అభివృద్ధి**

**-ఎమ్మెల్యే కాలె యాదయ్య**



పోతుగల్-మాచన్‌పల్లి బిటి రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే కాలే యాదయ్య

**షాబాద్, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:**

గ్రామాల అభివృద్ధికి రహదారులే పునాది అని, గ్రామాలు అన్ని రంగాల అభివృద్ధి చెందేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. షాబాద్ మండల పరిధిలోని పోతుగల్‌నుంచి మాచన్‌పల్లివరకు రూ.5కోట్ల వ్యయంతో చేపట్టనున్న బిటి రోడ్డు పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సర్దార్‌నగర్ ఎఎంసి చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, పోతుగల్‌గ్రామ సర్పంచి పామెన నర్సింలుతో కలిసి రోడ్డుపనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణప్రాంతాల అభివృద్ధిలో రహదారులు కీలకపాత్ర పోషిస్తాయని, ప్రజలకు మెరుగైన రవాణాసౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. మండలం పారిశ్రామికంగా మరింత అభివృద్ధి చెందనున్నదని, హైతాబాద్, చందన్‌వెల్లి, మాచన్‌పల్లి, సీతారాంపూర్ ప్రాంతాల్లో ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటుతో యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు అందేలా అధికారులు, నాయకులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిసిసి ప్రధాన కార్యదర్శి కుమ్మరి చెన్నయ్య, టిపిసిసి మైనారిటీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆశ్వక్ అలీ, సర్పంచులు సబితాగోవర్ధన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, పిఆర్ డిఈ విజయ్‌కుమార్, ఎఈ ఆశాజ్యోతి, నాయకులు జనార్దన్‌రెడ్డి, చేవెళ్ల స్వామి, జాకీర్ షరీఫ్, ముక్రం షరీఫ్, మోసిన్, రవీందర్‌నాయక్, మహేందర్‌గౌడ్, మాణిక్యంగౌడ్, రాజు, మాధవరెడ్డి, మాణిక్యం, శ్రీకాంత్‌గౌడ్‌లు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రతతో మలేరియా అంతం

**-మండల వైద్యాధికారి కిరణ్‌కుమార్‌గౌడ్**




ప్రపంచ మలేరియా ర్యాలీ నిర్వహించిన వైద్య సిబ్బంది

**కుల్కచర్ల, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:**

పరిసరాల పరిశుభ్రతతో మలేరియాను అంతం చేయవచ్చునని మండల వైద్యాధికారి కిరణ్‌కుమార్‌గౌడ్ అన్నారు. శనివారం మండల ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలోని ప్రపంచ మలేరియా దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా మండల వైద్యాధికారి కిరణ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ, గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా శుభ్రతను పాటిస్తేనే మలేరియా నిర్మూలన చేయడం సాధ్యమని అన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచి విజయ్‌కుమార్, హెల్త్‌అసిస్టెంట్ వెంకటయ్య, సూపర్వైజర్ విజయలక్ష్మి, పిహెచ్‌సి వైద్యసిబ్బంది, ఎఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

## వెంకటయ్యగౌడ్‌ను పరామర్శించిన కాంగ్రెస్‌నేతలు



వెంకటయ్యగౌడ్‌ను పరామర్శిస్తున్న కాంగ్రెస్‌నేతలు

**కుల్కచర్ల, ఏప్రిల్, 25 ప్రభాతవార్త:**

కాంగ్రెస్ కార్యకర్తలను పార్టీ కంటికిరెప్పలా కాపాడుకుంటుందని కాంగ్రెస్ పార్టీ మండల ప్రధానకార్యదర్శి గోపాల్‌నాయక్ అన్నారు. గత ఆదివారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి డ్రోన్ ప్రారంభోత్సవంలో డ్రోన్ ఆపరేటింగ్ ద్వారా కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు వెంకటయ్యగౌడ్ కాలికి సల్పగాయాలు కావడంతో శనివారం గోపాల్‌నాయక్ స్థానిక నాయకులతో కలిసి వెంకటయ్యగౌడ్‌ను పరామర్శించారు. కార్యక్రమంలో ఇప్పాయిపల్లి సర్పంచి మల్లేష్, శంకర్‌నాయక్, నర్సిములుగౌడ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీ కార్యదర్శులతో ఎఫ్సిడిఎ అధికారుల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీ మ్మినారాయణ, అధికారులు

**యాచారం, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:**

యాచారం మండలపరిషత్ కార్యాలయంలో ఫ్యూచర్‌సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ డిప్యూటీ డైరెక్టర్ స్నేహ, టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ గ్రామ కార్యదర్శులతో శనివారం సమావేశం ఏర్పాటుచేశారు. నూతనంగా ఏర్పాటుచేసిన ఫ్యూచర్‌సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ లేఅవుట్లు, భవన నిర్మాణాలు తదితర అంశాల విధివిధానాలపై అధికారులకు అవగాహన కల్పించారు. ఫ్యూచర్‌సిటీ భవిష్యత్తు ప్రణాళిక నియమాలు పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎంపిప శ్రీలత, వివిధశాఖల అధికారులు, గ్రామ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూములను కబ్జాచేస్తే చట్టరీత్యా చర్యలు

**-శామీర్‌పేట మండల తహసీల్దార్ సుచరిత**



ప్రభుత్వ భూములకు పిన్సింగ్ ఏర్పాటు చేసిన దృశ్యం

**శామీర్‌పేట, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:**

బొమ్మరాసిపేట్ గ్రామ రెవెన్యూ పరిధిలో ప్రభుత్వ భూమి సుమారు 17ఎకరాల22గుంటల భూమి విలువ సుమారు 50కోట్ల రూపాయలు ఉంటుందని, దాన్ని స్వాధీనంచేసుకుని, ఆభూములకు ఫెన్సింగ్ ఏర్పాటు చేసి, ప్రభుత్వ భూములుగా బోర్డులు ఏర్పాటుచేసినట్లు శామీర్‌పేట మండల తహసీల్దార్ సుచరిత తెలిపారు. శుక్రవారం ప్రభుత్వ భూములను వివిధ సర్వేనెంబర్లలో సర్వేలు చేసి గుర్తించిన సంగతి తెలిసిందే. శనివారం ఆ భూములకు ఫెన్సింగ్ (కంచె) వేయించి బోర్డులను ఏర్పాటు చేశారు. అయితే ఈ భూములను కొందరు కబ్జాలకు పాల్పడుతూ నీటి సంపులు ఏర్పాటుచేసి కమర్షియల్‌గా వాడుతున్నట్లు రెవెన్యూ అధికారుల దృష్టికిరావటంతో స్పందించిన తహసీల్దార్ సుచరిత వెంటనే ఆ భూములను పరిశీలించి సర్వే అధికారులతో సర్వే చేయించి ప్రభుత్వ భూములుగా వాటినిగుర్తించి, హద్దులను ఏర్పాటుచేసి ఫెన్సింగ్ వేయించినట్లు తెలిపారు. ప్రభుత్వ భూములను గుర్తించి స్వాధీనం చేసుకున్నందుకు స్థానిక ప్రజలు తహసీల్దార్‌ను అభినందిస్తూ హర్షం వ్యక్తంచేశారు. శామీర్‌పేట మండలంలో ఉన్న ప్రభుత్వభూములను ఎవరైనా కబ్జాలుచేస్తేనచట్టరీత్యా కఠినచర్యలు తీసుకుంటామని, కబ్జాలకుపాల్పడితే ఉపేక్షించేది లేదని శామీర్‌పేట మండల తహసీల్దార్ సుచరిత తెలిపారు. మండలంలో ఏ గ్రామంలోనైనా ప్రభుత్వభూములు కబ్జాలు జరిగినట్లు తెలిస్తే, తన దృష్టికి తీసుకవస్తే మాత్రం క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ సుచరిత ఈ సందర్భంగా స్పష్టంచేశారు.

## దాడి చేసిన వ్యక్తులను శిక్షించాలి

**-ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

**జిల్లెడుచౌదరిగూడ, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:**

జిల్లెడుచౌదరిగూడ మండలంలోని ఎల్కగూడ గ్రామ సర్పంచిపై దాడి చేసిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పోలీసులను ఆదేశించారు. శనివారం మండలంలోని పద్మారం గ్రామంలో ఈదమ్మ జాతరలో పాల్గొన్న ఎల్కగూడ సర్పంచి బందయ్యపై కొంత మంది వ్యక్తులు దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. గాయాలపాలైన సర్పంచిని చికిత్స నిమిత్తం షాద్‌నగర్ దవాఖానాకు తరలించారు.

**జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే...**

జిల్లెడుచౌదరిగూడ మండలంలోని పద్మారం గ్రామంలోని ఈదమ్మ జాతర కార్యక్రమంలో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొన్నారు. జాతరలో గాయపడిన సర్పంచి బందయ్య ఇంటికివెళ్లి కుటుంబసభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. దాడి విషయాన్ని పూర్తిస్థాయిలో విచారించాలని పోలీసులను ఎమ్మెల్యే ఆదేశించారు. సర్పంచికి మెరుగైన చికిత్స అందించాలని సంబంధిత డాక్టర్లతో ఫోన్‌లో మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

## అన్నదానం మహాదానం

**పెద్దేముల్, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:**

అన్నిదానాలలో అన్నదానం మహాదానమని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ఫౌండర్ బిచ్చప్ప అన్నారు. ఖాంజాపూర్ గుట్ట సమీపంలో కొలువైయున్న శ్రీవేంకటేశ్వరస్వామి సన్నిధిలో రేషం బిచ్చప్ప, సాయిపూర్ రాజు, మంతటి అయ్యప్ప, పి.పరమేష్, బి.సురేష్‌లు శనివారం అన్నదానం నిర్వహించడం జరిగింది.